www.prajapaksham.in
ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
మంగళవారం | 24 | ఫిబ్రవరి | 2026
పేజీలు : 8

ప్రతీ పేద కుటుంబానికి సంక్షేమ ఫలాలు

- నిరుపేద ఆడబిడ్డలకు ప్రభుత్వ భరోసా
- అభివృద్ధి సంక్షేమమే ధ్యేయం
- కూనంనేని
- రూ.1.98 కోట్ల చెక్కులు పంపిణీ

2 లో

విస్తరిస్తున్న సంచార వ్యాపారం..!

-రోడ్లపైనే లక్షల అమ్మకాలు
-ఇంటి ముంగిటకే అన్ని..

ప్రజాపక్షం/ ఖమ్మం : సంచారమే ఎంతో బాగున్నది. దానంత ఆనందమేమున్నది ఇల్లు పొల్లు లేని, మూల్లే మూట లేని ... అంటూ సంచార జీవితంపై గోరేటి వెంకన్న అద్భుతమైన పాట వ్రాశారు. సంచార జీవితంలో ఉన్న వెసులుబాటును వివరించారు. సంచార జీవితం సంగతేమో కానీ సంచార వ్యాపారం నలు దిశల విస్తరిస్తుంది. అద్దె లేని ప్రచారం అవసరం లేని తళుకు బెళుకు లేని వ్యాపారం సంచార వ్యాపారం ఇప్పుడు పలువురిని ఆకర్షిస్తుంది. ఆహార పదార్థాల మొదలు ఖరీదైన వస్తువులను సైతం రోడ్లపైనే విక్రయిస్తున్నారు. మొబైల్ వ్యాపారం ఇప్పుడు అన్ని రంగాలకు విస్తరించింది. ముఖ్యంగా నగరాలు, పట్టణాలలో రోడ్లపై మొబైల్ వ్యాన్లతో టిఫిన్, టీ సెంటర్లు మధ్యాహ్న పూట భోజనాలను ఏర్పాటు చేస్తున్నారు. హోటళ్లలో కంటే మొబైల్ క్యాంటీన్ల వద్ద చౌకగా దొరుకుతుండడంతో వినియోగదారులు మొబైల్ వ్యాపారుల వద్ద కొనుగోళ్లు జరుపుతున్నారు. ఉదయం పూట మొబైల్ టిఫిన్ సెంటర్ల వద్ద

మిగతా 2లో..

పెద్ద రైతు దారి కోసం
బక్క రైతు బలి..!

-రెవెన్యూ అధికారుల ఇష్టారాజ్యం

ప్రజాపక్షం/ ఖమ్మం : ఓ పెద్ద రైతు దారి కోసం బోనకల్ రెవెన్యూ అధికారులు ఓ బక్క రైతును బలి ఇచ్చారు. రెవెన్యూ అధికారుల దెబ్బకు తనకున్న కాస్త భూమిని ఆ రైతు కోల్పోయాడు. రెవెన్యూ అధికారులకు మాత్రం కాస్త దండిగానే దక్కినట్లు ఆరోపణలు వినవస్తున్నాయి. ఇందులో విద్యుత్ అధికారుల పాత్రపై కూడా తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఓ రైతు నుంచి ప్రభుత్వం సేకరించిన భూమిలో 16 అడుగుల దారి వదిలి సబ్ స్టేషన్ నిర్మాణానికి డిజైన్ చేయాల్సిన అవసరం ఏమిటన్న ప్రశ్న వినవస్తుంది. విద్యుత్ అధికారులను సైతం ప్రలోభాలకు గురి చేశారన్న సందేహం కలుగుతుంది. వివరాల్లోకి వెళితే... రాష్ట్ర ప్రభుత్వం బోనకల్ మండలం బ్రాహ్మణపల్లి గ్రామంలో విద్యుత్ సబ్ స్టేషన్‌ను మంజూరు చేసింది. స్థల అన్వేషణకు బయలుదేరిన రెవెన్యూ అధికారులను కొందరు ప్రలోభాలకు గురిచేసి నిరుపేద రైతు మందడపు నారాయణ భూమిని

మిగతా 2లో..

ప్రాణాలు పోతున్నా స్పందించని ప్రభుత్వం

- పెన్షనర్ బకాయిలను తక్షణం చెల్లించాలి
- పెన్షనర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షులు రాజేంద్రబాబు
- రిలే నిరాహార దీక్షలు ప్రారంభం

2 లో

ఉలిక్కపడ్డ అశ్వారావుపేట.. సుపారి హత్యలో స్థానికులు

ప్రజాపక్షం/ అశ్వారావుపేట : అశ్వారావుపేట ఒక్కసారిగా ఉలిక్కిపడింది. ప్రశాంతతకు మారుపేరుగా ఉండే అశ్వారావుపేట ప్రాంతం నుంచి కొందరు వ్యక్తులు సుపారి తీసుకుని ఓ వ్యక్తిని హత్య చేశారన్న వార్త తీవ్ర చర్చకు దారి తీసింది. మన ప్రాంతం వాళ్లు కిరాయి హత్యలు చేయడమా అని కొందరు అవాక్కయ్యారు. వివరాల్లోకి వెళితే... రాష్ట్రంలోనే సంచలనం సృష్టించిన బొగ్గుల శ్రీనివాస్ హత్య కేసులో అశ్వారావుపేటకు చెందిన కోటేశ్వరరావు వినాయకపురంకు చెందిన మహ్మద్ అలీఖాన్ ఉండటం ఈ చర్చకు కారణమైంది. ఆదివారం ఖమ్మం రూరల్ ఏసిపి తిరుపతిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... ఆర్థిక లావాదేవీల నేపథ్యంలో వేణుమాధవ్‌రెడ్డి అనే వ్యక్తితో చేతులు కలిపి కోటేశ్వరరావు, మహ్మద్ అలీఖాన్ వ్యక్తులు సుపారి తీసుకుని శ్రీనివాస్‌ను నకిరేకల్ వద్ద హత్య చేసి కారులో తీసుకు వచ్చి పాలేరు చెరువు వద్ద ప్రమాదం జరిగిందనేవిధంగా కారుతో సహా చెరువులో పడేశారు. చివరకు పోలీస్ పరిశోధనలో అశ్వారావుపేట ప్రాంతానికి చెందిన వారు వేణు మాధవ్‌రెడ్డి వద్ద సుపారి పొంది హత్య చేశారని తెలవడంతో ఈ ప్రాంత ప్రజలు ఆందోళనకు గురయ్యారు. అశ్వారావుపేట ప్రాంతంలో చిన్న చిన్న ఘర్షణలు తప్ప సుపారి సంస్కృతి ఎప్పుడు లేదు. ఇక్కడి ప్రజలు సుపారి గ్యాంగుల గురించి వినడం తప్ప చూడలేదు. ఇప్పుడు తమ మధ్య తిరిగే వారే నగదు తీసుకుని హత్య చేశారని తెలిసి భయాందోళనకు గురవుతున్నారు. ఇటువంటి వాటిని మొదటిలోనే తుంచి వేయాలని భవిష్యత్తులో ఇటువంటివి జరగకుండా తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

విస్తరిస్తున్న సంచార వ్యాపారం..!

(మొదటిపేజీ తరువాయి)

క్యూ కడుతున్నారు. ఖరీదైన హోటళ్లతో పాటు రుచి ఉండటం, కండ్ల ముందే తయారు కావడం, ధర చౌకగా ఉండటం కూడా మొబైల్ క్యాంటీన్ల సంఖ్య పెరగడానికి కారణమవుతుంది. ఇంటి వద్ద తయారు చేసుకుని వచ్చి భోజనాలు రోడ్ల వెంట పెట్టి విక్రయించే వారి సంఖ్య పెరుగుతుంది. కేవలం ఆహార పదార్థాలే కాదు బంగారం, వెండి మొదలైన అతి ఖరీదైనవి తప్ప మిగిలిన వాటిలో చాలా వరకు మొబైల్ వ్యాన్ల ద్వారా విక్రయిస్తున్నారు. సంచార గ్రంథాలయం మాదిరి సంచార వస్త్రాలయాలు ఏర్పాటవుతున్నాయి. ప్రత్యేక వాహనంలో అన్ని వస్త్రాలను ఉంచి రోడ్ల పక్క, కాలనీలలో తిరిగి విక్రయిస్తున్నారు. వీటికి కూడా బాగానే ఆదరణ ఉంది. కంపెనీ అవుట్‌లెట్ చౌకగా లభించే చెప్పులతో పాటు ఖరీదైన బూట్ల వరకు రోడ్ల పక్కన పెట్టి విక్రయిస్తున్నారు. ఒకప్పుడు తోపుడుబండ్ల వ్యాపారమంటూ హేళన చేసిన చోటే ఇప్పుడు మొబైల్ వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా వర్ధిల్లుతుంది. మొబైల్ వ్యాపారం ఇప్పుడు అన్ని రంగాలకు విస్తరించడంతో పాటు లాభాలను తెచ్చిపెడుతుందన్న భరోసా కలుగుతుంది. ముఖ్యంగా అద్దెలు, విద్యుత్ బిల్లులు ఉండవు. వ్యాపార అనుమతులు అవసరం లేదు. వ్యాపారాన్ని బట్టి కనీస ఏర్పాట్లు చేసుకుంటే సరిపోతుంది. పని చేసే వారి సంఖ్య అంతగా అవసరం లేదు. అదనపు ఖర్చులు లేకపోవడంతో వినియోగదారులు ఆవైపు మొగ్గు చూపుతున్నారు. సంచార ఆసుపత్రులు, రక్త పరీక్ష కేంద్రాలు కూడా గ్రామ గ్రామాన తిరుగుతున్నాయి. నిత్యావసర వస్తువులు, కూరగాయలు కూడా ఇంటి ముంగిటకే వస్తున్నాయి. మొత్తంగా సంచార వ్యాపారం జోరుగా సాగుతుంది. భవిష్యత్తులో వ్యాపారం ఎన్ని కొత్త పుంతలు తొక్కనుందో.

ప్రాణాలు పోతున్నా స్పందించని ప్రభుత్వం

ప్రజాపక్షం/ఖమ్మం : పెన్షనర్ల బకాయిలు చెల్లించక పోవడం, ఆరోగ్య పరమైన సమస్యల పరిష్కారానికి హెల్త్ కార్డులను జారీ చేయకపోవడం తదితర కారణాలతో రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్లు ప్రాణాలు కోల్పోతున్నా ఈ ప్రభుత్వం స్పందించకపోవడం శోచనీయమని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం (ఎస్‌జిపిఏటి) అధ్యక్షులు అర్విణి రాజేంద్రబాబు అన్నారు. పెన్షన్ బకాయిలు రాక ఒక ఖమ్మం జిల్లాలోనే ఏడుగురు ప్రాణాలు కోల్పోయారని అయినా ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం ఆధ్వర్యంలో పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం కలెక్టరేట్ ఎదుట రిలే నిరాహార దీక్షలను ప్రారంభించారు. తొలి రోజు దీక్షల్లో 21 మంది పెన్షనర్లు దీక్షలో కూర్చోనగా పెద్ద సంఖ్యలో పెన్షనర్లు, వివిధ సంఘాల ప్రతినిధులు హాజరై సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా పెన్షనర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు పరిశ పుల్లయ్య అధ్యక్షతన జరిగిన సభలో రాజేంద్రబాబు మాట్లాడుతూ 2024 ఏప్రిల్ మాసం నుండి ఉద్యోగ విరమణ చేసిన వారికి బకాయిలు చెల్లించ లేదని ఇందులో కొందరికి పెన్షన్ సైతం రావడం లేదన్నారు. ఉద్యోగ విరమణ తర్వాత ఆర్థిక ఇబ్బందులతో పెన్షనర్లు మనో వేదనకు గురవుతున్నారని ఆయన తెలిపారు. పలుమార్లు వివిధ రూపాలలో రాష్ట్ర ప్రభుత్వానికి విన్నవించినా ఫలితం లేకపోయిందన్నారు. ఈ నెల 28న ప్రవేశపెట్టే రాష్ట్ర బడ్జెట్‌లో పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి రూ. 20వేల కోట్లు కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. స్వాతంత్ర్యానికి ముందే పెన్షన్ విధానం ప్రారంభమైందని దేశ చరిత్రలో పెన్షన్ బకాయిలు చెల్లించకుండా ఇంత కాలం ఏ ప్రభుత్వం లేదని రాజేంద్రబాబు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం తీసుకు వచ్చిన వ్యాలిడేషన్ చట్టం పెన్షనర్ల ఉనికిని ప్రమాదంలోకి నెడుతుందన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ అధికారంలోకి రాగానే పెన్షనర్లకు నగదు రహిత వైద్యం అందిస్తామని హామీ ఇచ్చిందని కానీ ఇంత వరకు ఆ దిశగా చర్యలు చేపట్టలేదని దీనితో సరైన వైద్య సాయం పొందలేక పెన్షనర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆయన తెలిపారు. మెడికల్ అలవెన్స్‌లు పెంపుదల చేయాలని

అనేక దశాబ్దాల పాటు పోరాడి సాధించుకున్న పెన్షనర్ హక్కులను కాపాడేవిధంగా చట్టాలు రూపొందించాలని రాజేంద్రబాబు డిమాండ్ చేశారు. పెన్షనర్ వ్యతిరేక విధానాలను నిరసిస్తూ మార్చి 25న దేశ వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 398 ప్రత్యేక ఉపాధ్యాయులకు నోషనల్ ఇంక్రిమెంట్లు ఇవ్వాలని, వెల్‌నెస్ సెంటర్లలో వసతులు కల్పించాలని, డిఏ బకాయిలను ఏక మొత్తంగా చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కారమయ్యేంత వరకు ఆందోళనలు వివిధ రూపాల్లో కొనసాగుతాయని ఆయన తెలిపారు. ఈ రిలే నిరాహార దీక్షలలో రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి బి. నర్సయ్య, రాష్ట్ర కార్యదర్శి మేరీ ఏసుపాదం, జిల్లా ప్రధాన కార్యదర్శి రాయల రవి కుమార్, ఆల్ పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు గోపిచంద్ టిజివో జిల్లా అధ్యక్షులు కొంగర వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి మోదుగు వేలాద్రి, తపస్సు జిల్లా అధ్యక్షులు గండ్ర వెంకటరమణారెడ్డి, వివిధ సంఘాల నేతలు రామారావు, రామకోటేశ్వరరావు, మనోహర్ రాజు సంఘీభావం తెలిపారు. 82 సంవత్సరాల దుగ్గినేని శ్రీనివాసరావు ఈ దీక్షలకు ప్రత్యేకంగా హాజరై సంఘీభావం తెలిపారు.

నేడు మహిళా పెన్షనర్ల దీక్ష :

రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం ఆధ్వర్యంలో మంగళవారం మహిళా పెన్షనర్లు దీక్షల్లో పాల్గొననున్నట్లు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పరిశ పుల్లయ్య, రాయల రవికుమార్ లు తెలిపారు. రెండవ రోజు దీక్షలను జయప్రదం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు.

పెద్ద రైతు దారి కోసం బక్క రైతు బలి

(మొదటిపేజీ తరువాయి)

కేటాయించేలా చేశారు. స్థల కేటాయింపుకు సంబంధించి గ్రామసభ నిర్వహించడం కానీ, స్థల పంచనామ విషయం కానీ సదరు రైతుకు తెలియదు. మందడపు నారాయణకు సర్వేనెం. 116లో 35 కుంటల భూమి ఉంది. ఇది అనేక దశాబ్దాల నుంచి వారసత్వంగా వస్తుంది. ఈ భూమి ప్రధాన రహదారికి అనుకుని ఉంది. గతంలో నారాయణ భూమి నుంచి దిగువన ఉన్న రైతులు దారి అడిగారు. ఈ విషయమై ఒకట్రెండు సార్లు పంచాయతీలు కూడా జరిగాయి. దారి ఇవ్వడం కుదరదని నారాయణ తేల్చి చెప్పడంతో దొడ్డి దారిన దారి పొందెందుకు సబ్ స్టేషన్‌కు నారాయణ భూమి కేటాయించేలా రెవెన్యూ అధికారులను ఒప్పించారు. ఒక రైతు భూమి కోసం కేవలం 35 కుంటల భూమి కలిగి చేతి వృత్తిపై జీవించే నారాయణ భూమిని కేటాయించారు. కనీసం నారాయణకు సమాచారం ఇవ్వలేదు. గ్రామంలో చాటింపు వేయలేదు. పంచనామ సమయంలోనూ భూ యజమాని నారాయణకు సమాచారం ఇవ్వలేదు. పైగా 2013 వరకు నారాయణ పేరుతో అసైన్డ్ పట్టా ఉన్న దానిని ఇప్పుడు ప్రభుత్వ భూమిగా చూపుతున్నారు. అసైన్డ్ భూమి నుంచి ప్రభుత్వ భూమిగా ఎలా మారిందన్న ప్రశ్నకు బోనకల్ రెవెన్యూ అధికారులు సమాధానం చెప్పడం లేదు. మొత్తం భూమిని సేకరించి సబ్ స్టేషన్ నిర్మాణం జరిగే సందర్భంలో 16 అడుగుల స్థలాన్ని ఎందుకు వదిలేశారని ప్రశ్నిస్తే అందుకు విద్యుత్ అధికారులు సమాధానం చెప్పడం లేదు. విద్యుత్ అధికారులు, రెవెన్యూ అధికారులు కలగలిసి రైతు నారాయణను దెబ్బతీశారని కేవలం పెద్ద రైతు ప్రలోభానికి లొంగి ఈ పని చేశారని నారాయణ ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు. సోమవారం సబ్ స్టేషన్‌కు కేటాయించిన స్థలంలో బోరు వేశారు. అది కూడా 16 అడుగులు వదిలి బోరు వేయడం మరిన్ని అనుమానాలకు తావిస్తుంది. పెద్ద మొత్తంలో నగదు చేతులు మారబట్టే విద్యుత్, రెవెన్యూ అధికారులు ఇటువంటి పనికి శ్రీకారం చుట్టారని రైతు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. గ్రామసభలో తీర్మానం, పంచనామ పత్రాల నకలును నాకు అందజేయాలని 15 రోజులుగా రెవెన్యూ కార్యాలయం చుట్టూ తిరుగుతుంటే స్థానిక తహసీల్దార్ కలెక్టరేట్‌లో ఉందని గిర్దావర్ యుడిసి వద్ద ఉందని యుడిసి గిర్దావర్ వద్ద ఉందని తిప్పుతున్నారు తప్ప నకలు ఇవ్వడం లేదు. గతంలో ఇదే రైతు నారాయణ పహణి నకలు కోసం దరఖాస్తు చేస్తే నెలల తరబడి తిప్పుకుని చివరకు కనీసం సమాధానం కూడా చెప్పలేదు. కేవలం నారాయణ విషయంలోనే కాదు బోనకల్ మండలంలో రైతులందరి విషయంలో రెవెన్యూ అధికారులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఓ రైతును ఇదే రెవెన్యూ అధికారులు పెద్ద మొత్తంలో ఓ పని చేసేందుకు నగదు డిమాండ్ చేయడంతో ఆ రైతు ఏసిబి అధికారులను ఆశ్రయించినట్లు సమాచారం. ఈ విషయం తెలుసుకుని ఓ అధికారి సెలవుపై వెళ్లినట్లు కూడా ఆరోపణలు వినవస్తున్నాయి. మొత్తంగా రెవెన్యూ సదస్సుల పేరుతోనూ పెద్ద మొత్తంలోనే వసూలు చేసినట్లు ఆరోపణలు వినవస్తున్నాయి. బోనకల్ రెవెన్యూ అధికారుల అక్రమ వ్యవహారాలపై విచారణ జరిపితే అనేక విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది. భూ సేకరణ, దారి కేటాయింపు పై విచారణ జరిపి న్యాయం చేయాలని రైతు నారాయణ కోరుతున్నాడు.

ప్రతీ పేద కుటుంబానికి సంక్షేమ ఫలాలు

ప్రజాపక్షం/ కొత్తగూడెం : నియోజకవర్గ ప్రజల సంక్షేమ లక్ష్యంగా, పేద వర్గాల అభ్యున్నతే ధ్యేయంగా ఎంఎల్‌ఏ కూనంనేని సాంబశివరావు సోమవారం భారీ ఎత్తున సంక్షేమ ఫలాలు పంపిణీ చేశారు. స్థానిక ఎంఎల్‌ఏ క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో కొత్తగూడెం టౌన్, చుంచుపల్లి, లక్ష్మీ దేవిపల్లి, సుజాతనగర్ మండలాలకు చెందిన 168 మంది లబ్దిదారులకు రూ.1.68 కోట్ల విలువైన కళ్యాణ లక్ష్మీ , షాదీముబారక్‌చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద కుటుంబాల్లో ఆడ బిడ్డల పెళ్లిళ్లు భారం కాకుండా ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చోస్తేందన్నారు. నియోజకవర్గ పరిధిలో ఒకే దఫాలో 307 మంది కళ్యాణ లక్ష్మీ , షాదీ ముబారక్ చెక్కులు మంజూరు కావడం హర్ణణీయం అన్నారు. అనంతరం అనారోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్న 72 మంది బాదితులకు రూ.30.75 లక్షల విలువైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను కూడా అందజేశారు. ప్రజాపక్షం వహించే నాయకునిగా, నియోజకవర్గంలోని ప్రతి పేదవాడికి ప్రభుత్వం సహాయం అందే వరకు నిరంతరం కృషి చేయనున్నట్లు చెప్పారు. ప్రజా సమస్యల పరిష్కారమే తన తొలి ప్రాధాన్యత అని, అర్హులైన ప్రతీ ఒక్కరికి న్యాయం జరిగేలా పారదర్శకంగా పథకాలను అందజేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా, మేయర్ మూడ్ గణేష్, డిప్యూటి మేయర్ లలిత కుమారి, తహశిల్దార్లు పుల్లయ్య, కృష్ణప్రసాద్, నాగరాజు, కార్పొరేటర్లు, సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

వాహనాలు జాగ్రత్తగా నడపాలి

ప్రజాపక్షం/పెనుబల్లి: సింగరేణి బొగ్గు టిప్పర్ డ్రైవర్లు వాహనాలను జాగ్రత్తగా నడపాలని, మీ అతి స్పీడు నిర్లక్ష్యంతో కుటుంబాలు రోడ్డున పడతాయని సత్తుపల్లి రూరల్ సీఐ ముత్తు లింగం, సింగరేణి సత్తుపల్లి బ్రాంచ్ మేనేజర్ శ్రీనివాసరావు లు అన్నారు. సోమవారం పెనుబల్లిలోని సింగరేణి బొగ్గు రవాణా లారీ ఆఫీస్ వద్ద డ్రైవర్లకు యజమాన్యం పోలీసు రవాణా సింగరేణి సంస్థలు సంయుక్తంగా అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ, జిఎంలు మాట్లాడుతూ డ్రైవర్లు వాహనం నడిపేటప్పుడు మద్యం తాగి, సెల్ ఫోన్లు మాట్లాడుతూ వాహనాలు నడపవద్దని మొత్తం మీద మీరు నడిపేది కేవలం 60 కిలోమీటర్లు అని మీకు యజమాన్యం టార్గెట్ పెట్టిందని అతి స్పీడ్ గా నిర్లక్ష్యంగా వాహనాలు నడపొద్దని సూచించారు. ముఖ్యంగా సత్తుపల్లి లోడింగ్ పాయింట్ నుంచి దిగుమతి అయ్యే కొత్తగూడెం వరకు 60 కిలోమీటర్ల పరిధిలో ఈ రోడ్డు మొత్తం మీకు పూర్తి అవగాహన ఉంటుందని జనాభా సంచారం ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో, మూలమలుపు వద్ద వాహనాలను ఓవర్టేక్ చేసేటప్పుడు జాగ్రత్తగా ఉండాలని అలాంటి ప్రదేశాలలో వాహనాలు ఓవర్టేక్ చేయొద్దని సూచించారు ముఖ్యంగా లంకపల్లి, లంకాసాగర్ క్రాస్ రోడ్డు, వి ఎం బంజర్, పెనుబల్లి, ఉప్పలచలక, మద్దుకూరు వంటి మూలమలుపు ప్రాంతాల్లో వాహనాలు అతి స్పీడ్ గా వెళ్లిన సెల్‌ఫోన్ మాట్లాడిన మద్యం మత్తులో ఉన్న కేసులు నమోదు చేస్తామని వారు తెలిపారు. రోడ్డు ప్రమాదాలు దొరికితే ప్రమాదానికి కారణమైన డ్రైవర్ కుటుంబం బాధిత కుటుంబాలు కుటుంబ యజమానులను కోల్పోయి అట్టి కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని డ్రైవర్లు జాగ్రత్తగా వ్యవహరించి వాహనాలు నడపాలని సూచించారు రోడ్ల పైన అడ్డదిడ్డంగా వాహనాలు నిలిపివేయటం సరైన విధానం కాదని సి ఐ, జియం లు అన్నారు. ప్రమాదానికి కారణమైన డ్రైవర్లకు డ్రైవర్లకు కోట్లు శిక్షలు పడి జైలు జీవితం గడపాలు వస్తుందని హెచ్చరించారు. ఇకనుండి పగలు రాత్రులు సైతం డ్రంక్ అండ్ డ్రైవ్ కార్యక్రమం చేపడతామని అందులో దొరికిన వారి లైసెన్స్‌ను రద్దు చేస్తామని తద్వారా డ్రైవర్లు జీవనోపాధి కోల్పోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బొగ్గు టిప్పర్ల డ్రైవర్లు,యాజమాన్యం సిబ్బంది పాల్గొన్నారు.

గిరిజనుల భూములపై దోపిడీ

ప్రజాపక్షం/అశ్వాపురం: మమండల పరిధిలోని ఆనందపురం గ్రామంలో గిరిజనుల భూములపై వివాదం నెలకొంది. గ్రామానికి చెందిన సర్పంచ్ ముర్రం సమ్మయ్య, సుమారు 30 ఎస్టీ గిరిజన కుటుంబాలకు ఉన్న భూములు ప్రస్తుతం ఇతరుల పేర్లకు మార్చబడ్డాయని ఆరోపిస్తూ అధికారుల దృష్టికి విషయాన్ని తీసుకువచ్చారు.

వారు మీడియాకు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఈ కుటుంబాలు మొదటగా ఆనందపురం సమీపంలోని టేకులగూడెం అనే చిన్న గ్రామంలో మొదటి నుండి 1974 నుండి నెల్లిపాక రెవెన్యూలోని సర్వే నెంబర్ 700 నుండి 712లో సుమారు 4 ఎకరాలు విస్తీర్ణంలో నివాసం ఉండేవారు. అనంతరం అప్పటి ప్రభుత్వం వీరికి ఆనందపురం గ్రామంలో ఎస్సీ, ఎస్టీ, మైనార్టీఈ వారికీ నివాసాలకై కేటాయించిందని అందు వల్ల ఇక్కడకు వచ్చామని తెలిపారు. అయితే ఆ భూమిని పశువల పంట పొలాలకై వాడుతున్నామని, కొంత కాలం ఆ భూమి ఖాళీగా ఉండటాన్ని అదునుగా చేసుకుని అదే గ్రామానికి చెందిన కొందరు రైతులు ఆ భూమిని తమ పేర్లకు నమోదు చేసుకున్నారని వారు వాపోతున్నారు. ప్రస్తుతం ఆ భూములు వారి పేర్లలోనే కొనసాగుతుండటంతో అసలు హక్కుదారులైన గిరిజన కుటుంబాలు తీవ్ర ఆందోళన చెందుతున్నాయి. అధికారులు న్యాయం చేయాలన్నారు. ఈ నేపథ్యంలో అశ్వాపురం తహసీల్దార్, స్థానిక ఎంఎల్‌ఏ పాయం వెంకటేశ్వర్లుని కలిసి బాధితులు విజ్ఞప్తి చేస్తూ, తరాలుగా వస్తున్న భూమిని మాకు వచ్చే విధంగా పూర్తి స్థాయి విచారణ జరిపి అసలు లబ్దిదారులకు ఆ భూమిని తిరిగి అందించాలని కోరారు.

నిబద్ధతగల నాయకుడు అంజయ్య

సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్

ప్రజాపక్షం/కొణిజర్ల : మండల పరిదిలోని తనికెళ్లలో సోమవారం సిపిఐ నాయకులు మంచికంటి అంజయ్య 5వ వర్ధంతికార్యక్రమాన్ని సిపిఐ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. తొలుత అంజయ్య చిత్రపటానికి గ్రామ మాజీ సర్పంచ్ గడల సీతారామయ్య పూలదండి వేశారు. అనంతరం సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ మాట్లాడుతు అంజయ్య నిబద్ధత గల నాయకుడని గ్రామశాఖ కార్యదర్శిగా, గ్రామ ఉపరస్పంచ్‌గా పనిచేశారని నిత్యం ప్రజాసమస్యల పరిష్కారానికి పార్టీ ఇచ్చిన పిలుపును విజయవంతం చేసేవాడని కొనియాడారు. ఆయన లేని లోటు పార్టీకి, కుటుంబానికి తీరని లోటని అన్నారు. పార్టీపట్ల విశ్వాసంతో పార్టీని అభివృద్ధిపథంలో నడిపించడానికి ఎంతోమంది అమరులయ్యారని అన్నారు. సమస్యలను గుర్తించి సమస్యల పరిష్కారానికి పోరాడేది కమ్యూనిస్టులేనని అన్నారు. ఖమ్మం జిల్లాలో కమ్యూనిస్టు పార్టీ బలమైన శక్తిగా ఎదిగిందని తెలిపారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో మేయర్‌పదవి సిపిఐకి రావడం ఎంతో గర్వకారణం అని అన్నారు. ఈకార్యక్రమంలో సిపిఐ జిల్లా నాయకులు యర్రా బాబు, దొండపాటి రమేష్, పివిరావు, సిపిఐ మండల కార్యదర్శి గడల భాస్కర్‌రావు, సిపిఐ తనికెళ్ల గ్రామశాఖ కార్యదర్శి యాసా వెంకటేశ్వరరావు, సిపిఐ నాయకులు కొణపర్తి విష్ణుమూర్తి, గొడ్డుగొర్ల శ్రీను, గడల శ్రీనివాసరావు, పెదమల్ల రత్తమయ్య, పిన్నం పుల్లయ్య, లేడిబోయిన జలంధర్, బెజవాడ రాంబాబు, బాసా వెంకటేశ్వర్లు, అంజయ్య సోదరుడు మంచికంటి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఏదులాపురం ఘటనను వక్రీకరించకండి

-నిష్పక్షపాత విచారణ చేపట్టండి
-సిపిఐ రూరల్ మండల సమితి

ప్రజాపక్షం/ఖమ్మం : ఏదులాపురం గ్రామంలో ఈనెల 20న జరిగిన ఓ చిన్న ఘటనను వక్రీకరించి అవాస్తవాలు ప్రచారం చేస్తున్నారని, ఈ వక్రీకరణలు మానుకుంటే మంచిదని భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) రూరల్ మండల సమితి తెలిపింది. సోమవారం ఈ మేరకు సిపిఐ రూరల్ మండల సమితి ఒక ప్రకటన విడుదల చేసింది. ఏదులాపురం సిపిఐ కార్యాలయంలో గృహ నిర్మాణ శాఖ ఒప్పంద ఉద్యోగులు, గృహ నిర్మాణ లబ్దిదారులు ఉన్న సందర్భంలో ఏదులాపురం మాజీ సర్పంచ్ చెరుకుపల్లి భాస్కర్ అక్కడకు వెళ్లి అందరిని ఇక్కడకు ఎందుకు రప్పించారు లబ్దిదారుల ఇండ్లకు వెళ్లి ధృవపత్రాలు పరిశీలించవచ్చు కదా అని సూచించడం జరిగిందని ఆ ప్రకటనలో తెలిపారు. అంతే తప్ప ఒప్పంద ఉద్యోగి పట్ల చెరుకుపల్లి భాస్కర్ అసభ్యంగా, దురుసుగా మాట్లాడలేదని మీరు ఇక్కడ నుంచి వెళ్లిపోండి అని మాత్రం హెచ్చరించారు తప్ప ఇంతకు మినహా అక్కడ ఏమి జరగలేదన్నారు. దూషించినట్లు, చెంపపై కొట్టినట్లు ప్రచారం చేస్తున్నారని సిపిఐ తెలిపింది. అధికార పార్టీ నాయకులు కొందరు అభూత కల్పనలతో అవాస్తవాలను వాస్తవంగా చూపి జరిగిన ఘటనను వక్రీకరించి తప్పుడు కేసు పెట్టించారని అధికార పార్టీ బాధ్యులు ఈ విషయంపై పునః పరిశీలన చేయాలని సూచించింది. పోలీస్ అధికారులు ఈ ఘటనపై నిష్పక్షపాత విచారణ జరపాలని కోరారు. ఈ ఘటన స్థలంలో 30 నుండి 40 మంది లబ్దిదారులు ఉన్నారు. వారి సమక్షంలోనే ఈ ఘటన జరిగింది. తిరిగి వారి సమక్షంలోనే విచారణ జరపాలని కోరింది. గత ప్రభుత్వంలో కొందరు ఇటువంటి విధానాలను అవలంభించి తమకు గిట్టని వారిని ఇబ్బందుల పాలు చేశారని ప్రస్తుతం కాంగ్రెస్ కూడా అదే రీతి అవలంభించడం సరికాదని సిపిఐ తెలిపింది. ఈ ఘటనపై బహిరంగ విచారణకు సిపిఐ సిద్ధంగా ఉందని తప్పుడు కేసులు రాజకీయాలను కలుషితం చేస్తాయని తెలిపింది. రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి జోక్యం చేసుకుని అక్రమ కేసులను నివారించాలని తెలిపింది. పోలీస్ అధికారులు సైతం నిష్పక్షపాత విచారణ జరిపి ఏమి జరిగిందో తెలుసుకోవాలని సిపిఐ మండల సమితి కోరింది. ఈ ప్రకటన విడుదల చేసిన వారిలో మండల కార్యదర్శి పుచ్చకాయల సుధాకర్, నాయకులు సిద్దినేని కర్ణ కుమార్, మిడికంటి వెంకటరెడ్డి, ఉన్నం రంగారావు, వెంపటి వెంకట సురేందర్ ఉన్నారు.

ఉద్యోగుల హక్కుల కోసం సింగరేణి సిఎండికి వినతి

ప్రజాపక్షం/సత్తుపల్లి: సింగరేణి సంస్థలో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కీలక సమస్యల పరిష్కారానికి మరో అడుగు పడింది. సింగరేణి ఆఫీసర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం సింగరేణి చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ కి మెమోరాండం సమర్పించారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి జనరల్ మేనేజర్ చింతల శ్రీనివాస్ ముఖ్యపాత్ర పోషించి, అధికారులు ఎదుర్కొంటున్న సమస్యలను సంస్థ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా పి.ఆర్.పి అమలు, పే అబ్రిడేషన్‌కు సంబంధించిన అంశాలు ఎన్నో సంవత్సరాలుగా పరిష్కారానికి నోచుకోకపోవడంతో ఉద్యోగుల్లో ఆందోళన నెలకొన్న విషయాన్ని మెమోరాండంలో ప్రస్తావించారు. సింగరేణి ఆఫీసర్స్ అసోసియేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ, సంస్థ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్న అధికారుల న్యాయమైన హక్కులను పరిరక్షించాల్సిన బాధ్యత యాజమాన్యంపై ఉందన్నారు. పెండింగ్ సమస్యలపై సానుకూల నిర్ణయాలు తీసుకుని తక్షణమే అమలు చేయాలని వారు విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ ఆఫీసర్ జేవిఆర్‌ఓసి ఎన్వీఆర్ ప్రహ్లాద, ప్రాజెక్ట్ ఆఫీసర్, కిష్టారం సునీల్ వర్మ, ప్రాజెక్టు ఇంజనీర్ జే వి ఆర్ ఓసీ డి శ్రీనివాసరావు, ప్రాజెక్టు ఇంజనీర్ కిష్టారం ఓసి జివి రావు, జేవి ఆర్‌ఓసి మేనేజర్ శ్రీ బి రాజేశ్వరరావు, కళ్యాణ్ రామ్, కిష్టారం ఓసీ మేనేజర్ రామకృష్ణ , సీఎంఓఏఐ వైస్ ప్రెసిడెంట్ రమేష్ బాబు, ట్రెజరర్ శ్రీనివాస్, ఇతర ఆఫీసర్లు పాల్గొన్నారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపై సిపిఎం పోరుబాటు

- సిపిఎం మధిర డివిజన్ కార్యదర్శి మడిపల్లి గోపాలరావు

ప్రజాపక్షం/ బోనకల్ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై సిపిఎం నిరంతరం పోరాటాలు నిర్వహిస్తుందని సిపిఎం మధిర డివిజన్ కార్యదర్శి మడిపల్లి గోపాలరావు అన్నారు. స్థానిక వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట అమరవీరుల భవనంలో సిపిఎం మండల కమిటీ సమావేశం జొన్నలగడ్డ సునీత అధ్యక్షతన సోమవారం జరిగింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను ఎలా మోసం చేయాలనే ధ్యాస తప్ప ప్రజా సమస్యల పరిష్కారం కోసం పాటుపడటం లేదని విమర్శించారు. మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మోసంతో విజయం సాధించారని విమర్శించారు. అధికారం పేరుతో ప్రజలను మోసంచేసి విజయం పొందారని ఎద్దేవా చేశారు. మధిర మున్సిపాలిటీ అభివృద్ధికి ఆమడదూరంలో ఉందని అన్నారు. మధిర పట్టణంలో అన్ని ప్రధాన రహదారుల్లో సైడ్ డ్రైనేజీ లేక ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారన్నారు. డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్క తాను చేసిన అభివృద్ధి తమ పార్టీని గెలిపించిందని చెప్పుకోవడం చాలా విడ్డూరంగా ఉందని అన్నారు. మధిర మున్సిపాలిటీ అనేక రకాల సమస్యలకు నిలయంగా మారిందన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం పనిచేసేది సిపిఎం మాత్రమే అన్నారు. ఈ సమావేవంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు దొండపాటి నాగేశ్వరరావు, మండల కార్యదర్శి కిలారు సురేష్, నాయకులు బంధం శ్రీనివాసరావు, కొమ్మినేని నాగేశ్వరరావు, కూచిపూడి మురళీకృష్ణ, తెల్లాకుల శ్రీనివాసరావు, పసుపులేని నరేష్ తదితరులు పాల్గొన్నారు.

స్నేహితుడి కుటుంబానికి ఆర్థికసాయం

ప్రజాపక్షం/సత్తుపల్లి: పట్టణంలోని గాంధీ నగర్ కు చెందిన తడికమళ్ళ పుల్లారావు మున్సిపాలిటీలో పారిశుధ్య కార్మికులు విభాగంలో డాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తూ,విధి నిర్వహణలో ఉండగా గుండెపోటుతో మృతి చెందారు. ఈ క్రమంలో 9394 సంవత్సరం వేంసూరు జడ్పీహెచ్ఎస్ హైస్కూల్‌లో పుల్లారావుతో కలిసి చదువుకున్న 10వ తరగతి పూర్వ విద్యార్థులు చిన్ననాటి మిత్రుడు పుల్లారావు కుటుంబానికి సోమవారం రూ. 40వేలు ఆర్థిక సహాయాన్ని ఆయన భార్యకు అందజేశారు. పుల్లారావు కుటుంబానికి భవిష్యత్తులో అండగా ఉంటామని స్నేహితులు హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా వారి చిన్న నాటి స్నేహితుడు పుల్లారావు జ్ఞాపకాలను కుటుంబ సభ్యులతో కలిసి పంచుకున్నారు.ఆర్థిక సాయమందించిన పుల్లారావు చిన్ననాటి మిత్రులకు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

వసంతరావు ఆశయసాధనకై కృషి చేయాలి

ప్రజాపక్షం/సత్తుపల్లి: సీపీఎం సత్తుపల్లి పట్టణ కమిటీ ఆధ్వర్యంలో పాకలపాటి వసంతరావు 4వ వర్ధంతి సభను పట్టణ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి జిల్లా కమిటీ సభ్యులు శ్రీనివాస్ పూలమాల వేసి నివాళులర్పించారు. పట్టణ కార్యదర్శి కోలికపోగు సర్వేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సభలో జిల్లా నాయకులు మోరంపూడి పాండురంగారావు, జాజిరి శ్రీనివాస్, రావుల రాజబాబు మాట్లాడారు. వసంతరావు సత్తుపల్లిలో పార్టీ నిర్మాణానికి కీలకంగా పనిచేసి, కష్టజీవుల పక్షాన ఉద్యమాలను నడిపిన నేత అని కొనియాడారు. ఆయన ఆశయ సాధనకు పార్టీ శ్రేణులు కృషి చేయాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో పాకలపాటి మల్లికార్జున్, పాకలపాటి శ్రీనివాసరావు పాక లపాటి ఝాన్సీ ,జాజిరి జ్యోతి, సిపిఎం మండల కార్యదర్శి రమేష్, బడే మియా వెంకటేశ్వరరావు, జిలాని, బెజవాడ లక్ష్మీ నారాయణ, వెంకటేశ్వరావు, ఆలీ మరియు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ చైర్‌పర్సన్ కాపా చంద్రకళ దంపతులకు సన్మానం

ప్రజాపక్షం/వైరా: వైరా మున్సిపాలిటీ చైర్‌పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ, మురళీకృష్ణ దంపతులను పిఆర్‌టియు వైరా మండల శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వెలిశెట్టి నర్సింహారావు, వేమిరెడ్డి గోవర్ధన్ ఆధ్వర్యంలో నూతన చైర్‌పర్సన్‌గా ఎన్నికైన సందర్భంగా అభినందనలు తెలిపి సన్మానించారు. మున్సిపాలిటీ చైర్మన్ చంద్రకళ మాట్లాడుతూ ఇంతమంది ఉపాధ్యాయులు ఇక్కడికి రావడం చాలా సంతోషంగా ఉందని, మీరందరూవిద్యార్థులకు చక్కగా బోధించి ఉన్నత పౌరులుగా తీర్చిదిద్దాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పిఆర్‌టియు సంఘం రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు డి.సత్యనారాయణ, మండల మహిళా బాధ్యులు నాగరాణి, పద్మావతి, సరస్వతి, లతా మాధురి, సావిత్రి, నీలా, శ్రావణి, ఉమాపార్వతి, సుశబుల, రూప, శ్రీదేవి, సుష్మ, మండల సీనియర్ బాధ్యులు చంద్రశేఖర్‌రెడ్డి, రాఘవరావు, నాగరాజు, రవికుమార్, సత్యనారాయణ, ప్రభాకర్, యాదగిరి, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల అక్రమ హౌస్ అరెస్టులను ఖండిస్తున్నాం

ప్రజాపక్షం/సత్తుపల్లి: గత మూడు రోజులుగా బీజేపీ కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణ రెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు నారపరాజు రామచంద్రరావును అక్రమంగా హౌస్ అరెస్టు చేయడం రేవంత్ రెడ్డి ప్రభుత్వ నియంతృత్వ ధోరణికి నిదర్శనమని, రాష్ట్రంలో జరుగుతున్న అక్రమ హౌస్ అరెస్టులను తీవ్రంగా ఖండించారు భారతీయ జనతా పార్టీ ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి నాయుడు రాఘవరావు సోమవారం సత్తుపల్లి నియోజకవర్గ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కామారెడ్డిలో కాంగ్రెస్ నాయకులు బీజేపీ కార్యాలయంపై దాడికి ప్రయత్నించడమే కాకుండా, అడ్డొచ్చిన కార్యకర్తలపై కూడా దాడులు చేశారని ఆరోపించారు. కార్యకర్తలను పరామర్శించేందుకు బయలుదేరిన వెంకటరమణ రెడ్డిని హౌస్ అరెస్టు చేయడం దుర్మార్గమైన చర్యగా పేర్కొన్నారు. అలాగే కాంగ్రెస్ నాయకుడు షబ్బీర్ అలీ తన స్వంత రాజ్యాంగాన్ని అమలు చేస్తున్నట్లు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. బీజేపీ కార్యకర్తలను పరామర్శించేందుకు బయలుదేరిన రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యేలు, ముఖ్య నాయకులను హౌస్ అరెస్టు చేసి కాంగ్రెస్ ప్రభుత్వం వారికి వత్తాసు పలుకుతోందని ఆరోపించారు.ఈ అక్రమ అరెస్టులు, దాడులను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమం చేపడతామని హెచ్చరించారు.ఈ సమావేశంలో సత్తుపల్లి మండల అధ్యక్షుడు సాలి శివకృష్ణ, వేంసూరు మండల అధ్యక్షుడు గొర్ల ప్రభాకర్ రెడ్డి, సత్తుపల్లి పట్టణ ప్రధాన కార్యదర్శి మందా శివతో పాటు పలువురు బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రంథాలయ ఏర్పాటుకు స్థలం కేటాయించాలి

ప్రజాపక్షం/చంద్రుగొండ: చంద్రుగొండ గ్రామ పంచాయితీలో గ్రంథాలయం ఏర్పాటు కొరకు స్థల కేటాయించాలని తహసీల్దార్ సంధ్యారాణిని సర్పంచ్ ఇస్లావత్ రుక్మిణి కలిసి వినతి పత్రం అందించారు. ఈసందర్భంగా సర్పంచ్ రుక్మిణి మాట్లాడుతూ గ్రంథాలయం కోసం స్థలం కేటాయించాలని కోరారు. ఈకార్యక్రమంలో సేవాదళ్ జిల్లా అధ్యక్షులు కేశబోయిన నరసింహారావు, ఉప సర్పంచ్ అంతటి రామ కృష్ణ, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు చిన్నంశెట్టి మహేష్, మైనార్టీ సెల్ మండల అధ్యక్షులు అన్వర్ హుస్సేన్, మండల నాయకులు పొరుపల్లి భాస్కరరావు, కడియాల పుల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

భూక్య సామినికి నివాళి

ప్రజాపక్షం/కారేపల్లి: భాగ్యనగర్ తండా గ్రామ పంచాయితీ పరిధిలో గల సామ్యతండ నివాసి భూక్య సామిని మరణించిన విషయం తెలుసుకున్న భాగ్యనగర్ తండా గ్రామ సర్పంచ్ బానోత్ హీరాలాల్ అనుచరులతో కలిసి వారి భౌతికాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ భూక్య సామిని ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈకార్యక్రమంలో ఉప సర్పంచ్ గుగులోత్ బిక్కులాల్, కాంగ్రెస్ మండల సీనియర్ నాయకులు బానోత్ రామచందర్, రాందాస్, గుగులోత్ భీముడు, వార్డు సభ్యులు వాంకుడోత్ గాంధీ, పార్టీ నాయకులు, గ్రామ పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్స్ బకాయిలను విడుదల చేయాలి

ప్రజాపక్షం/కారేపల్లి: పెన్షనర్స్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని పిఆర్‌పిఏ జిల్లా కన్వీనర్ యలమద్ది వెంకటేశ్వర్లు అన్నారు. ప్రోగ్రెసివ్ రికగ్నైడ్ పెన్షనర్స్ అసోసియేషన్ ఖమ్మం జిల్లా శాఖ ఆధ్వర్యంలో కారేపల్లి హెడ్ క్వార్టర్‌లో నివాసముంటున్న పెన్షనర్స్‌కు పిఆర్‌పిఏ సభ్యత్వాన్ని ఇచ్చారు. అనంతరం జరిగిన పిఆర్‌పిఏ ముఖ్య కార్యకర్తల సమావేశంలో వైవీ మాట్లాడుతూ ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగులకు ఉద్యోగ సమయంలో దాచుకున్న డబ్బులను వెంటనే విడుదల చేసి, వారికున్న సమస్యల నుండి విముక్తి పొందేలా రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉద్యోగ విరమణ పొంది 22 నెలలు గడుస్తున్నప్పటికీ గ్రాట్యువిటీ, కమ్యుటేషన్ జిపిఎఫ్, జిఐఎస్, లీవ్ ఎన్ క్యాష్మెంట్ ఇవ్వకపోవడం వల్ల, పెన్షన్లు ఆర్థిక ఇబ్బందులతో తీవ్రంగా మనోవేదన చెందుతున్నారని తెలిపారు. ఈకార్యక్రమంలో ఎం సీతారామయ్య, వి మోహన్ దాస్, పి మాధవరావు, దామోదర్‌రెడ్డి, ఎండి బాబు, సిహెచ్ వెంకటేశ్వర్లు, కే భద్రయ్య, జీవి రంగారావు, బి రమాదేవి, బి వెంకటరెడ్డి, ఏ బిక్షమయ్య, తదితరులు పాల్గొన్నారు.

వైట్ కలర్‌లను తగ్గించండి.. వార్డుల్లో పని చేయించండి

వైరా మున్సిపల్ చైర్‌పర్సన్ కాపా చంద్రకళ

ప్రజాపక్షం/వైరా: వైరా మున్సిపాలిటీని క్లీన్‌గా చేయండి, అవినీతికి తావు లేకుండా చూడండి అని వైరా మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ మురళీకృష్ణ అన్నారు. సోమవారం వైరాలో మున్సిపాల్ కార్యాలయం నందు మున్సిపాల్ వైస్ చైర్మన్ కట్ల సంతోష్‌తో కలిసి మున్సిపాల్ చైర్‌పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ శానిటేషన్‌పై చర్చించారు. ఈ సందర్భంగా శానిటేషన్ అధికారి వీరన్నతో మాట్లాడుతూ టోటల్ కార్మికులు ఎంతమంది, ఎంతమంది పనిచేస్తున్నారు. ఎక్కడెక్కడ పనిచేస్తున్న అనే దానిపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా శానిటేషన్ అధికారి వీరన్న 114 మంది వర్కర్లు ఉన్నారు. 50 మ ంది స్పెషల్ డ్రైవ్, 64 మంది ఔట్‌సోర్సింగ్ సిబ్బంది ఉన్నారని చెప్పారు. దీంతో వారు ఇంతమంది సిబ్బంది ఉండంగా పనులు ఎందుకు కావడం లేదని ప్రశ్నించారు. పనులు విషయంలో మీరు ఎక్కడ ఉపేక్షించవద్దు, వైట్ కలర్‌లను తగ్గించండి, వర్క్ చేయించండి అని ఆదేశించారు. వర్క్ చేయకుండా ఎవరైనా నిర్లక్ష్యం ఉంటే వెంటనే వారి వివరాలను మాకు అందించాలని తెలిపారు. పారిశుద్ధ్యం విషయంలో రోడ్లను క్లీన్‌గా ఉంచండి అని అన్నారు. ఎక్కడ అవినీతికి తావు లేకుండా ప్రతి పైసా ప్రజలకు ఉపయోగపడే విధంగా ఖర్చులు చేయవద్దని మున్సిపాల్ అధికారులకు తెలిపారు. పారిశుద్ధ్యం విషయంలో మీరు ఎంతమందిని ఉపయోగించుకుంటారో అంత మందిని ఉపయోగించుకోండి సిటీ మాత్రం శుభ్రతగా కనిపించండి ఒక్కటే మా ధ్యేయమని వారు అన్నారు.

మధిరలో పెట్రేగిపోతున్న ప్రైవేట్ ఫైనాన్స్ సంస్థలు..!

- అక్రమార్జనే ధ్యేయంగా అధిక వడ్డీలు వసూలు
- వడ్డీల పేరుతో పేదలను హింసిస్తున్న ఫైనాన్స్ నిర్వాహకులు
- ఫైనాన్స్ సంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్

ప్రజాపక్షం/ మధిర : ప్రైవేట్ ఫైనాన్స్ సంస్థలు పడగ విప్పి పెట్రేగిపోతున్నాయి. పేదల అవసరాలకు రుణాలు వచ్చి వారి వద్ద నుండి అధిక వడ్డీలను వసూలు చేస్తూ సకాలంలో వాయిదాలు చెల్లించకపోతే వారిని చిత్రహింసలు పెడుతున్నారని మధిర మండలంలో పెద్ద ఎత్తున ఆరోపణలు విన్పిస్తున్నాయి. గ్రామాల్లో సైతం ప్రైవేట్ ఫైనాన్స్ సంస్థలు తమ కార్యాకలాపాలను విస్తరింపచేసి పేద కుటుంబాలను చిన్నాభిన్నం చేస్తున్నాయి. పేద ప్రజల అవసరాలే ఆసరాగా చేసుకుని అధిక వడ్డీలకు రుణాలు ఇచ్చి వారి నడ్డి విరుస్తున్నాయి. మధిరలో ప్రైవేట్ ఫైనాన్స్ సంస్థలు పేద, సామాన్య, ఆర్థిక అవసరాలను టార్గెట్‌గా చేసుకుంటూ గృహ నిర్మాణాలు, పేద పిల్లల చదువులు, పంటల పెట్టుబడి, ఉపాధి రంగాల పేరుతో అధిక వడ్డీలకు రుణాలు ఇస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. కొన్ని ప్రైవేట్ సంస్థలు వ్యక్తిగతంగా కొన్ని గ్రూపుల పేరుతో ఎక్కువగా కొంతమంది మహిళలను లక్ష్యంగా చేసుకుని నెల వారం కిస్తీలుగా రూ.1లక్ష వరకు రుణాలు ఇస్తున్నారు. రెండు మూడు వారాలు లేదా రెండు మూడు నెలలు కస్తీలు కట్టకుండా ఉంటే ఇళ్ల ముందుకు వచ్చి మీరు కడుతారా కట్టరా అంటూ బెదిరిస్తూ మీరు చస్తే చావండి... మాకెందుకు మాకు డబ్బులు కట్టండి అని అంటూ రికవరీ ఏజెంట్లు అనేక ఇబ్బందులకు గురి చేస్తున్నట్లు బాధితులు వాపోతున్నారు. గత కొన్నేళ్లుగా ప్రభుత్వరంగ బ్యాంకులు చిన్నతరహా రుణాలు ఇవ్వకపోవడంతో పేద ప్రజలు తక్షణ అవసరాల కోసం ప్రైవేట్ ఫైనాన్స్ ఆశ్రయిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆ సంస్థలు రూ.1లక్ష నుండి రూ.10లక్షల వరకు రుణాలు ఇస్తూ 10 నుండి 20శాతం వడ్డీలు వసూలు చేస్తున్నారు. రుణాలను బట్టి కిస్తీలు వారం, 15రోజులు, నెల రోజులు వ్యవధి ఇస్తూ వడ్డీతో సహా వసూలు చేస్తున్నారు. ఒక వేళ కిస్తీ కట్టని పక్షంలో బాధితుల ఇంటి మీదకు రావడం, బెదిరింపులకు పాల్పడటం, డబ్బులు కట్టే వరకు వదిలే ప్రసక్తే లేదంటూ అక్కడి నుండి కదలకుండా కూర్చోవడంతో పలువురు వీటిని తట్టకోలేక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆరోపణలు ఉన్నాయి. గతంలో ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీల పోరాటంతో అప్పటి ప్రభుత్వం ప్రైవేట్ ఫైనాన్స్ రెగ్యులేటర్ యాక్ట్‌ను తీసుకువచ్చి నియంత్రించడం జరిగింది. కాగా గత మూడేళ్ల తర్వాత మళ్లీ ఇప్పుడు ఖమ్మం జిల్లా మధిర మండలంలో ప్రైవేట్ ఫైనాన్స్ సంస్థలు పుట్ట గొడుగుల్లా పుట్టుకొస్తూ పేదలకు అధిక వడ్డీ రుణాలు ఇచ్చి వారిని పీల్చి పిప్పి చేస్తున్నాయని, వారి వేధింపులకు తాళలేక పలువురు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ప్రజలు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజల బాధను అర్థం చేసుకుని ప్రైవేట్ సంస్థలను నియంత్రించేందుకు రెగ్యులేటర్ యాక్ట్ తీసుకురావాలని, అధిక వడ్డీలకు రుణాలు ఇచ్చి వసూలు చేస్తున్న ఫైనాన్స్‌సంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలి ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

కళ్యాణి లక్ష్మీ, సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ

ప్రజాపక్షం/ఆళ్లపల్లి: ఆళ్లపల్లి మండలంలోని రైతు వేదికలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంఎల్ఏ పాయం వెంకటేశ్వర్లు పాల్గొని కళ్యాణ లక్ష్మీ, ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను అర్హులైన లబ్దిదారులకు అందజేశారు. ఈసందర్భంగా కళ్యాణ లక్ష్మీ పథకం కింద 24 మంది లబ్దిదారులకు మొత్తం 24,02,784 రూపాయల చెక్కులను పంపిణీ చేసి, పేద కుటుంబాల ఆడపిల్లల వివాహాలకు ఆర్థిక భరోసా కల్పించారు. అదనంగా ముఖ్యమంత్రి సహాయ నిధి కింద 6 గురు లబ్దిదారులకు 1,70,000 రూపాయల ఆర్థిక సహాయం అందజేసి, అత్యవసర పరిస్థితుల్లో ప్రభుత్వం ప్రజలకు అండగా నిలుస్తోందని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రతి అర్హులైన కుటుంబానికి చేరేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. సంక్షేమ పథకాల ద్వారా సామాజిక భద్రత, ఆర్థిక స్థిరత్వం పెరుగుతుందని వివరించారు. ఈకార్యక్రమంలో తహసీల్దార్ జగదీశ్వర వర ప్రసాద్, ఎంపీడీవో డి శ్రీనివాస్, ఏఈ హైసింగ్ శ్రావణ్, డాక్టర్ సంఘమిత్ర, మండల అధ్యక్షులు, సర్పంచ్ పాయం రామ నరసయ్య, ఆళ్లపల్లి సర్పంచ్ వాసం సుస్మిత, అనంతోగు సర్పంచ్ కల్తీ వెంకటేశ్వర్లు, నడిగూడెం సర్పంచ్ సత్య కుమారి, బోడయికుంట సర్పంచ్ ఏడుల శ్రావణి, మార్కోడు సర్పంచ్ సుతారి రామాదేవి, రాయపాడు సర్పంచ్ ఊకే చిన్న పాపయ్య, వాసం శ్రీకాంత్, ఇతర నాయకులు పాల్గొన్నారు.

యుద్ధ ప్రాతిపదికన కరకట్ట నిర్మించండి

ప్రజాపక్షం/బూర్గంపాడు: బూర్గంపాడు మండలం వైపు యుద్ధప్రాతిపదికన కరకట్ట నిర్మించాలని భద్రాద్రి ప్రాంత పరిరక్షణ సమితి అధ్యక్షులు డాక్టరేట్ బూసిరెడ్డి శంకర్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణం పూర్తి అయితే భద్రాచలం వద్ద గోదావరి నది నీటి మట్టం కనీసం 40అడుగులు ఉండే పరిస్థితి ఉందని నిపుణులు చెబుతున్నారని, జీరో నీటిమట్టం ఉన్నప్పుడే 70 అడుగుల నీటి మట్టం పెరుగుతూ ఉధృతంగా వరద వస్తుందని, అదే 45 అడుగుల నీటి మట్టం ఉన్నప్పుడు ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా కనీసం 90 అడుగులు మేరకు వరదలు వచ్చే ప్రమాదం పొంచి ఉందన్నారు. అదే జరిగే భద్రాచలం పట్టణంతో సహా చుట్టు పక్కల ప్రాంతాలన్నీ వీటి ముంపుకు గురి కాక తప్పదని, ఇండ్లు పొలాలు నీట మునిగి అపారనష్టమే కాకుండా ప్రాణహాని కూడా ఉండొచ్చని నిపుణులు పేర్కొంటున్నారని తెలిపారు. కాబట్టి యుద్ధ ప్రాతిపదికన భద్రాచలం రక్షణ కోసం నిర్మించిన కరకట్ట పగుళ్లను నియంత్రించి సత్వర మరమ్మతులు చేసి అవసరమైన చోట కరకట్ట ఎత్తును పెంచి కరకట్టను బలోపేతం చేయాలన్నారు. ఎట్టపాక వైపు మరి కాస్త ఎత్తు పెంచకపోతే వరద నీరు మొత్తం భద్రాచలంలోకి అకస్మాత్తుగా ప్రవేశించి పెద్ద ఉపద్రవం జరిగే అవకాశం ఉందన్నారు. అలాగే బూర్గంపాడు, సంజీవరెడ్డిపాలెం, రెడ్డిపాలెం, సారపాక, ముత్యాలంపాడు, మోతె, ఇరవెండి, నెల్లిపాక బంజరు తదితర ప్రాంతాల వరకు కూడా యుద్ధ ప్రాతిపదికన కరకట్ట నిర్మించకపోతే పరిసర గ్రామాలన్నీ వరదల బారిన పడి అపార నష్టానికి గురవుతాయని, కాబట్టి కేంద్రం నుండి బూర్గంపాడు మండలం వైపుక కరకట్టల నిర్మాణానికి, భద్రాచలం వైపు ఉన్న కరకట్ట మరమ్మతులకు కేంద్ర ప్రభుత్వం తక్షణ నిధులు ఇవ్వాల్సిందిగా కోరుతున్నామని భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి విజ్ఞప్తి చేశారు. స్థానిక శాసన సభ్యులు బూర్గంపాడు వైపు కరకట్టల నిర్మాణానికి పట్టించుకోకపోవడం దురదృష్టమని విమర్శించారు. ఇటువంటి ప్రజాప్రతినిధులకు భవిష్యత్తులో ఓటు వేయకుండా తరిమికొట్టాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

ఆలయ పునఃప్రతిష్ఠకు పూనుకోవడం అభినందనీయం

వెంకటేశ్వర స్వామి దేవాలయాన్ని సందర్శించిన కూనంనేని
- రహదారి సౌకర్యానికి హామీ
- ఎంఎల్ఏకు ఆలయ మర్యాదలలో ఘన స్వాగతం

ప్రజాపక్షం/పాల్వంచ : గుడిపాడు వెంకటేశ్వర స్వామి ఆలయ భక్తులు, ప్రజల సౌకర్యార్థం రహదారి సౌకర్యాన్ని కల్పించనున్నట్లు కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు హామీ ఇచ్చారు. ఆ ఆలయాన్ని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్కే సాబీర్ పాషా, కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్, ఆలయ నిర్మాణ దాత నల్లా సురేష్ రెడ్డితో కలిసి సందర్శించిన ఆయన పరిసరాలను పరిశీలించారు. కాకతీయుల కాలం నాటి ఈ దేవాలయానికి పూర్వ వైభవాన్ని తీసుకొచ్చేందుకు ఎన్ సురేష్ రెడ్డి ఆధ్వర్యంలో రూ.2 కోట్లతో జరిగిన ఆలయ పునఃప్రతిష్ఠ పనులపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఏ మాట్లాడుతూ క్రీ.శ 1219 1313 మధ్య కాలంలో కాకతీయ రాజు ప్రతాతరుద్రినిచే ఈ ఆలయం నిర్మించబటినట్లు చరిత్ర చెబుతోందని, ఎంతో వైభగంగా కొంతకాలం శోభిల్లిందని, తర్వాతి కాలంలో శిథిలావస్తకు చేరిందన్నారు. 2011 సం.లో పాల్వంచలో తహశిల్దార్‌గా విధులు నిర్వహించిన మస్తాన్ రావు శిథిలమైన ఆలయాన్ని చూసిన ఆ పరిసరాలను వెంటనే శుభ్రం చేయించారని, అప్పటి నుండి గ్రామ ప్రజలు, అర్చకులు తోలేటే నగేష్ శర్మ చే దూపదీప నైవేద్యాలు ఆలయంలో నిత్యం జరుగుతున్నాయని చెప్పారు. అతి పురాతనమైన కాకతీయ కాలంలో నిర్మించిన వెంకటేశ్వర స్వామి దేవాలయాన్ని శ్యామల గోపాలం ఎడ్యుకేషనల్ ఫౌండేషనల్ చైర్మన్ ఎన్ సురేష్ రెడ్డి దేవాలయ పునఃనిర్మాణానికి ముందుకొచ్చినట్లు చెప్పారు. దేవాదాయ ధర్మాదాయ శాఖ సహకారంతో రూ.2 కోట్ల నిధులతో దేవాలయం పునః ప్రతిష్ఠ మహోత్సవాలను నిర్వహించడం అభినందనీయం అన్నారు. ఇందులో భాగంగా ఈనెల 21 నుండి 26 వరకు విగ్రహా పునఃప్రతిష్ఠ మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎంతో చారిత్రాత్మక విశిష్టత కలిగిన ఈ ఆలయం తెలంగాణలోనే శోభిల్లే అవకాశం ఉందని ఆయన చెప్పారు. దీనిని మరింత వైభవంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం దృష్టికి తీసుకెళతానని, ఇక్కడి వచ్చే భక్తులు, ఈ ప్రాంత ప్రజల సౌకర్యార్థం ప్రత్యేకంగా రోడ్డు నిర్మాణంతో పాటు మౌళిక సదుపాయాల కల్పనకు కృషి చేయనున్నట్లు ఎంఎల్ఏ చెప్పారు. ముందుగా ఎంఎల్ఏ, పాషా తదితరులకు ఆలయ మర్యాదలకు ప్రకారం అర్చకులు స్వాగతం పలికి ఆశీర్వచనాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కార్పోరేటర్లు అడుమిల్లి సాయి బాబా, వీశంశెట్టి విశ్వేశ్వరరావు, గుర్రం వెంకటేశ్వర్లుతో పాటు ఈఓ ఎన్ రజనీ కుమారి నాయకులు గౌతమి కృష్ణ, వాడే లక్ష్మీ ,శనగారపు శ్రీనివాస్, వల్లపు యాకయ్య, ఆరెం ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

రైతాంగ సమస్యలను పరిష్కరించాలి

- స్వామినాథన్ కమీషన్ సిఫారసులను అమలు చేయాలి
- ఉపాధి హామీ పథకానికి 80 శాతం నిధులను కేటాయించాలి
- తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా కార్యదర్శి ముత్యాల

ప్రజాపక్షం/పాల్వంచ : కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రైతాంగ వ్యతిరేక చర్యలను విడనాడి రైతు సమస్యలను వెంటనే పరిష్కరించాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా కార్యదర్శి ముత్యాల విశ్వనాథం డిమాండ్ చేశారు. పాల్వంచ పట్టణంలోని సిపిఐ కార్యాలయం చంద్రా రాజేశ్వరరావు భవనంలో తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం (ఏఐకేఎస్) జిల్లా కౌన్సిల్ సమావేశం సంఘం జిల్లా అధ్యక్షులు చంద్రా నరేంద్ర కుమార్ అధ్యక్షతన సోమవారం జరిగింది. ఈ సందర్భంగా ముత్యాల విశ్వనాథం మాట్లాడుతూ నాయకులు రైతు సంఘం బలోపేతానికి కృషి చేయాలన్నారు. ఈ మేరకు మండల కమిటీలు వేసి రైతు, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. రైతు ప్రభుత్వం, ప్రజా ప్రభుత్వం అంటూ గొప్పలు చెపుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు రైతు భరోసా అందించలేదని మండిపడ్డారు. దీనితో పెట్టుబడి కోసం వడ్డీ వ్యాపారులను ఆశ్రయించిన రైతులు తీవ్ర ఇబ్బందులకు గురి అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే రైతు భరోసాను అందించి రైతాంగాన్ని ఆదుకోవాలన్నారు. ఇప్పటికే నిలిపివేసిన సిసిఐ పత్తి కొనుగోళ్ళను పునరుద్దరించి మార్చి చివరి వరకు కొనుగోళ్ళు చేసి రైతులను దళారుల నుండి కాపాడాలని ప్రభుత్వాన్ని కోరారు. సన్న దాన్యానికి చెల్లిస్తున్న బోనస్ డబ్బులను రైతుల ఖాతాలో తక్షణమే వేయాలన్నారు. స్వామినాథన్ కమీషన్ సిఫారసులను అమలు చేస్తూ రైతాంగానికి గిట్టుబాటు ధరలను కల్పించాలన్నారు. కేంద్రంలోని బిజేపి ప్రభుత్వం ప్రజావ్యతిరేక విధానాలను అవలంభిస్తున్నదని విమర్శించారు. అనంతరం జిరాంజి పేరుతో పథకాన్ని అమలు చేస్తున్నదన్నారు. స్వాతంత్ర సంగ్రామంలో పాల్గొన్న మహాత్మాగాంధీ పేరును తొలగించటం దారుణమన్నారు. ఉపాధి హామీ పథకానికి గతంలో 80 శాతం నిధులు కేంద్ర ప్రభుత్వం వాటా, 20 నిధులు రాష్ట్ర ప్రభుత్వం వాటా ఉందన్నారు. కానీ పథకాన్ని బుట్టదాఖలు చేయటానికి ప్రస్తుతం 60 శాతం నిధులను మాత్రమే విడుదల చేస్తూ రాష్ట్ర ప్రభుత్వంపై 40 శాతం నిధులతో పెను భారం మోపుతోందన్నారు. దీనితో రాబోయే రోజుల్లో పథకం అమలుపై నీలి నీడలు అలముకొంటున్నాయని వాపోయారు. కేంద్ర ప్రభుత్వం స్పంధించి ఉపాధి హామీ పథకంలో పాత విధానాన్ని పాటిస్తూ 80 శాతం వాటా విడుదల చేయాలన్నారు. ఆన్‌లైన్ విధానంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కావునా రైతులకు సరిపడా యూరియాను నేరుగా అందజేయాలని పాలక ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు వ్యవసాయ కార్మిక సంఘం నిర్మాణ బాద్యులు కల్లూరి వెంకటేశ్వరరావు, సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు సరెడ్డి పుల్లారెడ్డి, రాష్ట్ర కమిటీ కన్వీనర్ సలిగంటి శ్రీనివాస్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి నరాటి రమేష్, వాడె లక్ష్మి, రాష్ట్ర సమితి సబ్యులు వైఎస్. గిరి పాల్గొన్నారు.

చొప్పకట్లపాలెంలో ఉపాధి హామీ పనుల పరిశీలన

ప్రజాపక్షం/ బోనకల్ : మండల పరిధిలోని చొప్పకట్లపాలెం గ్రామంలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులను సోమవారం సర్పంచ్ కాటేపల్లి అశ్వినిశేఖర్, ఇవ సత్యనారాయణ, టిఏ సురేష్ పరిశీలించారు. ఈ సందర్భంగా అభివృద్ధి పనులను పరిశీలించి పనుల నాణ్యత, కార్మికుల హాజరు, వేతనాల చెల్లింపులపై వివరాలను తెలుసుకున్నారు. అనంతరం సర్పంచ్ అశ్విని మాట్లాడుతూ గ్రామాభివృద్ధిలో ఉపాధిహామీ పనులు ఎంతో ఉపయోగపడుతాయని, పనులను సమయానికి పూర్తిచేసి గ్రామానికి మరింత మౌలిక వసతులను అందించాలనే లక్ష్యంతో అందరూ కలిసికట్టుగా పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉసర్పంచ్, సిబ్బంది, కార్మికులు పాల్గొన్నారు.



నూతన జంటను ఆశీర్వదించిన కూనంనేని

ప్రజాపక్షం/ములకలపల్లి: మాదారం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఉకంటి గోపాల్‌రావు కుమారుడు వివాహా వేడుకకు కొత్తగూడెం ఎంఎల్ఏ కూనంనేని సాంబశివరావు హాజరయ్యారు. ఈసందర్భంగా నూతన జంటను ఆయన ఆశీర్వదించి, శుభాకాంక్షలు తెలిపారు. ఈకార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్కే సాబీర్ పాషా, కొత్తగూడెం మేయర్ గణేష్, కాంగ్రెస్ నాయకులు బత్తుల అంజి, నాగళ్ల వెంకటేశ్వరరావు, బొల్లేపల్లి రమేష్, తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇల్లును పరిశీలించిన పాయం

ప్రజాపక్షం/ఆళ్లపల్లి: రామానుజగూడెం గ్రామంలో బొల్ల భవాని నిర్మాణ దశలో ఉన్న ఇందిరమ్మ ఇల్లును ఎంఎల్ఏ పాయం వెంకటేశ్వర్లు పరిశీలించారు. నిర్మాణ పనుల పురోగతిని సమీక్షించి, నాణ్యత ప్రమాణాలు ఖచ్చితంగా పాటిస్తూ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. అర్హులైన పేద కుటుంబాలకు స్థిరమైన నివాసం కల్పించడం ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. లబ్దిదారునికి త్వరితగతిన గృహం అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈకార్యక్రమంలో మాజీ ఎంపీపీ పడిగ సమ్మయ్య, వాసం శ్రీకాంత్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్‌ను నియంత్రించాలి

ప్రజాపక్షం/పాల్వంచ : భావితరాలకు స్వచ్ఛ వాతావరణాన్ని అందించటానికి ప్లాస్టిక్ వినియోగాన్ని నియంత్రించి ప్రకృతి పరిరక్షణకు పాటు పడాలని టిఎన్‌జీసి రిసోర్స్ పర్సన్ ఎ. శారద అన్నారు. మండల పరిధి లక్ష్మిదేవిపల్లిలోని పాల్వంచ ప్రభుత్వ అటానమస్ డిగ్రీ కళాశాల ఇకోక్లబ్ ఆద్వర్యంలో, తెలంగాణ నేషనల్ గ్రీన్‌కార్ప్స్ సహకారంతో పర్యావరణ విద్యా కార్యక్రమంలో భాగంగా కిన్నెరసాని ప్రకృతి శిబిరం,ఫీల్డ్ ట్రిప్ సోమవారం ఘనంగా నిర్వహించారు. డిగ్రీ కళాశాల విద్యార్థులు కిన్నెరసాని ప్రాజెక్టును సంధర్శించారు. ఈ సంధర్భంగా శారద మాట్లాడుతూ పర్యాచరణ పరిరక్షణ, జీవ వైవిద్యం, ప్లాస్టిక్ రహిత సమాజం పై అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం ద్వారా ప్రకృతిని కాపాడుకోవచ్చని తెలిపారు. ముందుగా కళాశాల ప్రిన్సిపాల్ పి. పద్మ మాట్లాడుతూ ప్రకృతి శిభిరాలు విద్యార్థుల్లో బాద్యతను పెంపొందిస్తాయన్నారు. ఫారెస్ట్ బీట్ అధికారి బి. నాగేష్ అడవులు సంరక్షణపై కథా రూపంలో వివరించారు. ఈ కార్యక్రమంలో అద్యాపకులు టి. అరుణ కుమారి, ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ వేముల కామేశ్వరరావు, కొండలరావు,పొట్లపువ్వు శ్రీనివాసరావు, కోటగిరి రాంబాబు, ఎన్. శ్రీదేవి, హారిక, బి. రమేష్, ధర్మారావు, రాజ్‌కుమార్, పవన్, ఈ శ్రీను, భాను, ప్రవీణ్, ఇకోక్లబ్ కన్వీనర్ డి. రమేష్, పి. శ్రీనివాసరావు, విద్యార్థులు, అటవీ అధికారులు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల సమగ్రాభివృద్ధికి వార్డు సభ్యులు తోడ్పాటు అందించాలి

ప్రజాపక్షం/బూర్గంపాడు: గ్రామాల సమగ్రాభివృద్ధికి గ్రామ పంచాయితీ వార్డు సభ్యులు తోడ్పాటు అందించాలని ఎంపీడీవో జమలారెడ్డి అన్నారు. మంగళవా రం అంజనాపురం, కృష్ణసాగర్, లక్ష్మీ పురం, మోతెపట్టినగర్, ముసలమడుగు, నకిరిపేట, పినపాక పట్టినగర్, ఉప్పుసాక, వేపులగడ్డ గ్రామ పంచాయితీల వార్డు సభ్యులకు రెండవ విడత శిక్షణ తరగతుల కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ వార్డుల సభ్యులకు పంచాయితీ రాజ్ చట్టాల మీదపై అవగాహన కల్పించారు. వార్డు సభ్యుల విధులు బాధ్యతలను తెలిపారు. పంచాయితీ రాజ్ చట్టానికి సంబంధించిన విధి విధానాలు కలిగిన హ్యాండ్ బుక్‌ను ఇచ్చారు. త్రాగునీరు సరఫరా, వీధి దీపాలా నిర్వహణ, మురికి కాలువల నిర్వహణ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ప్రతి గ్రామంలోని అంగన్వాడీ కేంద్రాల పరిస్థితిని సర్పంచులతో పాటు నిరంతరం పర్యవేక్షించి చిన్నారులు, బాలింతలకు పోషకాహారం సక్రమంగా అందుతున్నదీ లేదో పరిశీలించాలని సూచించారు. అక్షరాస్యత పెంపు, విద్యాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా గ్రామ పంచాయితీలకు అందుతున్న అభివృద్ధి పథకాల నిధులను సక్రమంగా వినియోగించి త్రాగునీరు, పారిశుద్యం, రహదారులు, విద్యుత్, ఆరోగ్యం వంటి మౌలిక సదుపాయాలకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. గ్రామాల్లో మంచినీటి ఎద్దడి తలెత్తకుండా పాలకవర్గం చర్యలు చేపట్టాలన్నారు. ఈకార్యక్రమంలో టీవోటీలు ఎస్ కృష్ణ చైతన్య, బి వెంకటేష్, కే శ్రీనివాసరావు, సిహెచ్ కిరణ్ కుమార్, గ్రామ పంచాయితీల కార్యదర్శులు, కంప్యూటర్ ఆపరేటర్స్, తదితరులు పాల్గొన్నారు.

వైరా మున్సిపాలిటీని సుందరంగా తీర్చిదిద్దుతా..

20 వార్డులను రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి చేస్తా
పారిశుద్ధ్యానికి అధిక ప్రాధాన్యం
ఇప్పటిదాకా వైద్యసేవలందించా.. ఇప్పుడు ప్రజాసేవలందిస్తా..
నా కుటుంబ సభ్యుల సపోర్టు మరిచిపోలేనిది
ప్రజాపక్షంతో వైరా మున్సిపాలిటీ తొలి చైర్ పర్సన్ కాపా చంద్రకళ

ప్రజాపక్షం/వైరా: వైరా మున్సిపాలిటీ తొలి మున్సిపాల్ మహిళా చైర్పర్సన్ కావడం అదృష్టంగా భావిస్తున్నా. గత కొన్ని సంవత్సరాల నుండి నా భర్త డాక్టర్ కాపా మురళీకృష్ణ సేవా కార్యక్రమాలతో పాటు రాజకీయాల్లో ఉన్నారు. ఊహించని అవకాశం వచ్చింది. మున్సిపాల్ చైర్పర్సన్‌గా ఎన్నుకున్నారు. రాజకీయాలకు అతీతంగానే మున్సిపాలిటీలోని 20 వార్డులను అభివృద్ధి చేసే బాధ్యత నాపై ఉంది అని వైరా మున్సిపాలిటీ తొలి మహిళ చైర్పర్సన్ కాపా చంద్రకళ అన్నారు. ప్రజాపక్షంతో చైర్పర్సన్ కాపా చంద్రకళ మాట్లాడుతూ డ్రైనేజీ వ్యవస్థ, పారిశుద్ధ్యం నిర్వహణ, విద్యుత్ లైట్లు ఏర్పాటు, అంతర్గత రోడ్ల నిర్మాణం, త్రాగు నీటి సరఫరా మెరుగుపరిచి నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దాలని, మున్సిపాలిటీ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో మౌళిక వసతులు కల్పించాలన్నదే తన లక్ష్యమని చెప్పారు. వైద్య వృత్తిలో ఉన్న నేను మున్సిపాల్ చైర్పర్సన్ అవుతానని అనుకోలేదు.

మున్సిపల్ చైర్పర్సన్ కావడం నా అదృష్టంగా భావిస్తున్నా...

వైరా మున్సిపాల్ తొలి మహిళ చైర్పర్సన్ కావడం నా అదృష్టంగా భావిస్తున్నా. చైర్పర్సన్‌గా నా పేరు చెప్పే వరకు కూడా నాకు తెలియదు. అందరిలా కౌన్సిల్‌లో కూర్చొన్న నన్ను వైరా మున్సిపాల్ చైర్పర్సన్ ప్రకటించడంతో ఆశ్చర్యపోయా, వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని అందరి సహకారంతో సుందరంగా తీర్చిదిద్దుతాను అని డాక్టర్ కాపా చంద్రకళ తెలిపారు.

ఆరో వార్డు ప్రజలకు రుణపడి ఉంటా...

వైరా మున్సిపాలిటీ ఆరో వార్డు ప్రజలు తనపై ఎంతో విశ్వాసంతో భారీ మెజారిటీతో కౌన్సిలర్‌గా గెలిపించారు. వార్డు ప్రజలకు రుణపడి ఉంటా, గత ఎన్నికల్లో కూడా 6వ వార్డు ప్రజలు మా కుటుంబ సభ్యులను గెలిపించారు. మరల ఈ ఎన్నికల్లో మాత్రం అన్ని వర్గాల ప్రజలు మాకు అండగా నిలిచారు. ఎన్నికలు జరిగిన తర్వాత గెలుస్తాం అన్న పూర్తి నమ్మకం ఉండేది. కాని ఇంత పెద్ద మెజారిటీ వస్తుందని అనుకోలేదు. నాకు ఓటేసిన ప్రజలను ఎప్పటికి మరిచిపోలేను.

డ్రైనేజీలతో, అండర్ డ్రైన్ నిర్మాణంతో క్లీన్ సిటీగా వైరా...

వైరా మున్సిపాలిటీలో 20 వార్డుల్లో డ్రైనేజీ నిర్మాణాన్ని ప్రతిష్టంగా తీసుకోవడం జరుగుతుంది. ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ ఇప్పటికే మున్సిపాలిటీ అభివృద్ధి కోసం పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేయడం జరిగింది. అభివృద్ధి కోసం అండర్ డ్రైన్ నిర్మాణం కోసం ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క సహకారంతో ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ సారధ్యంలోపారిశుద్ధ్యంపైప్రత్యేకశ్రద్ధతీసుకోవడంజరుగుతుందని అన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో మౌళిక వసతుల ఏర్పాటు...

ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు మౌళిక వసతులు కల్పించాలి. వాటికి అధిక ప్రాధాన్యత ఇచ్చి మా పార్టీ పెద్దలు కౌన్సిల్ సభ్యుల సహకారంతో చర్యలు తీసుకుంటాం. బాత్‌రూమ్‌ల ఏర్పాటు, నీటి వసతి కల్పిస్తాం, అన్ని వార్డుల్లో పర్యటించి అభివృద్ధికి ప్రణాళికలు చేసుకుంటాను.

అందరి సహకారంతో మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి చేస్తా...

కాంగ్రెస్ పార్టీ పెద్దలు ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ నాపై నమ్మకంతో ఎంతో పెద్ద బాధ్యత అప్పగించారు అందరిని కలుపుకొని వెళతా, పార్టీలకు అతీతంగా వైరా మున్సిపాలిటీని అభివృద్ధి చేసి ఆదర్శ నగరంగా మార్చేందుకు కృషి చేస్తా. వార్డుల్లో పరిస్థితులు తెలుసుకొని వాటిని పార్టీలో, కౌన్సిల్‌లో చర్చించి ప్రభుత్వం నుంచి నిధులు తెచ్చి అభివృద్ధి చేస్తా. సంక్షేమ పథకాలు కూడా అర్హులైన ప్రతిఒక్కరికి అందేలా పూర్తి స్థాయిలో కృషి చేస్తా.

డంపింగ్‌యార్డ్ సమస్యకు పరిష్కారం...

వైరా మున్సిపలిటీలో అతి ముఖ్యమైన సమస్య డంపింగ్ యార్డ్ సమస్య, దాని కోసం ప్రత్యేక దృష్టి పెట్టడం జరుగుతుంది, ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ ఆదేశాలతో అధికారులతో కలిసి త్వరలోనే డంపింగ్‌యార్డ్ నిర్మాణం కోసం అనుకూలమైన స్థలం ఏర్పాటు చేయడం జరుగుతుంది.

మున్సిపాలిటీ ఆదాయంపై ప్రత్యేక ఫోకస్...

మున్సిపాలిటీ ఆదాయ వనరులపై ప్రత్యేక దృష్టి పెట్టడం జరుగుతుంది. ప్రతి నెల ఆదాయ వనరులు ఏ విధంగా ఉన్నాయి. ఏ విధంగా పెంచాలని దానిపై కౌన్సిల్ సభ్యులతో చర్చించడం, అందరు సహకారంతో ఆదాయ వనరును మరింత పెంచి మున్సిపాలిటీని అభివృద్ధిలో ముందు ఉంచేందుకు అందరు సహకారంతో ముందుకు పోతానని వైరా మున్సిపాల్ చైర్పర్సన్ కాపా చంద్రకళ తెలిపారు.

పది పరీక్షల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు

-మార్చి 14 నుంచి ఏప్రిల్ 16 వరకు పరీక్షల నిర్వహణ
-16,975 మంది విద్యార్థులకు 98 పరీక్షా కేంద్రాలు
-పది పరీక్షల నిర్వహణపై అదనపు కలెక్టర్ సమావేశం

ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : జిల్లాలో పదవ తరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి తెలిపారు. కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో సోమవారం అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి పదవ తరగతి పరీక్షల నిర్వహణపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ మార్చి 14 నుంచి ఏప్రిల్ 16 వరకు పదవ తరగతి పరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు. జిల్లాలో 16,975 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతారని వీరి కోసం 98 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రతి పరీక్షా కేంద్రం వద్ద అవసరమైన మేర భద్రతా ఏర్పాట్లు కల్పించాలన్నారు.ఆరు ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్‌లను ఏర్పాటు చేయాలని, ప్రతి పరీక్షా కేంద్రం వద్ద సిట్టింగ్ స్క్వాడ్ ఏర్పాటు చేయాలన్నారు. పరీక్షా కేంద్రాల చుట్టు పక్కల ఉన్న జిరాక్స్ కేంద్రాలను పరీక్షా సమయంలో మూసివేయాలన్నారు. ప్రశ్నా పత్రాల తరలింపుకు సెక్యూరిటీ ఏర్పాటు చేయాలని, పరీక్షా కేంద్రాల వద్ద ఫస్ట్ ఎయిడ్ కిట్ అందుబాటులో ఉంచాలన్నారు. విద్యార్థులు సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకునేవిధంగా అవసరమైన రూట్లలో ఆర్టిసి బస్సులు నడపాలన్నారు. పరీక్షల నేపథ్యంలో నిరంతరాయంగా విద్యుత్ సరఫరా ఉండేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద త్రాగునీరు, ఇతర మౌలిక వసతులు కల్పించాలన్నారు. ప్రశ్నా పత్రాలను సమీప పోలీస్ స్టేషన్‌లో భద్రపరిచి పరీక్ష రోజు బందోబస్తుతో పరీక్షా కేంద్రాలకు సరఫరా చేసేలా తగు కార్యాచరణ చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో ప్రభుత్వ పరీక్షల సహాయ కమిషనర్ లక్ష్మి ప్రసాద్, విద్యాశాఖ ఏడి చావా శ్రీనివాస్, డిఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ రామారావు, మిషన్ భగీరథ ఈఈ పుష్పలత, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

ప్రజాపక్షం/చింతకాని : ప్రకృతి వ్యవసాయం వల్ల భూమి జీవశక్తి పెరుగుతందని మధిర ఏడిఏ స్వర్ణ విజయచంద్ర రైతులకు సూచించారు. వ్యవసాయ శాఖ వారిచే చింతకాని మండలం రేపల్లెవాడ గ్రామంలో ప్రకృతి వ్యవసాయ సాగు పై సోమవారం రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏడిఏ మాట్లాడుతూ సేంద్రియ వ్యవసాయం తో మట్టి నాణ్యత మెరుగుపడటంతో పాటు ఆరోగ్యవంతమైన ఆహారం లభిస్తుందన్నారు. సేంద్రీయ వ్యవసాయానికి జీవ ఎరువులు , వర్మీకంపోస్ట్, గోమూత్రం, పుల్లటి మజ్జిగ, బ్రహ్మాస్త్రం, ద్రవ జీవామృతం, నీమాస్త్రం వంటివి వాడాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారిణి సోములపల్లి మానస, కృషి విజ్ఞాన కేంద్రం వైరా శాస్త్రవేత్త ఫణిశ్రీ, గ్రామ సర్పంచ్ మడిపల్లి అంబిక, ఉపసర్పంచ్ బందం చిన్న కృష్ణ, ఏఈవో తేజ, పంచాయతీ కార్యదర్శి రామారావు, రైతులు పాల్గొన్నారు.

బత్తుల సోమయ్యకు సిపిఐ నేతల పరామర్శ

ప్రజాపక్షం/ ఖమ్మం : తెలంగాణ ఉద్యమకారుడు బత్తుల సోమయ్యను సోమవారం సిపిఐ నాయకులు పరామర్శించారు. ఇటీవల సోమ య్య ఆయన సతీమణి రోడ్డు ప్రమాదానికి గురైన విషయం విధితమే. ఖమ్మంలోని ప్రైవేటు ఆసుపత్రిలోచికిత్స పొందుతున్న ఆయనను పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. పరామర్శించిన వారిలో సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు తాటి వెంకటేశ్వరరావు తదితరులు ఉన్నారు.

పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించండి

ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : గ్రామ పంచాయతీలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ (ఏఐటియుసి) ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని పంచాయతీ కమిషనర్ కార్యాలయంలో డిప్యూటీ కమిషనర్ సుధాకర్‌కు సోమవారం వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు టంగుటూరి నర్సింహారెడ్డి మాట్లాడుతూ గ్రామ పంచాయతీల్లో పని చేస్తున్న కార్మికుల పెండింగ్ వేతనాలను చెల్లించాలని, ఇతర సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కోరారు. సానుకూలంగా స్పందించిన డిప్యూటీ కమిషనర్ పెండింగ్ వేతనాలతో పాటు ఇతర సమస్యలను త్వరలో పరిష్కరించేందుకు తగు చర్యలు తీసుకుంటామని యూనియన్ నేతలకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి. వెంకట్ రాజ్యం, రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి పిట్టల మల్లయ్య, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఆంజనేయులు పాల్గొన్నారు.

త్రివేణిలో సైన్స్ ఎక్స్‌పో

ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని త్రివేణి పాఠశాలలో సైన్స్ ఎగ్జిబిషన్‌ను నిర్వహించారు. సోమవారం పాఠశాలలో నిర్వహించిన సైన్స్ ఎక్స్‌పోను ఎన్‌సిఎస్‌సి కో ఆర్డినేటర్ ఎనుముల వెంకటేశ్వర్లు, ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్ లు ప్రారంభించారు. విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టులను పరిశీలించి అభినందనలు తెలిపారు. విద్యార్థులు సహజ నీటి శుద్ధి పద్ధతులు, కృత్రిమ అవయవాల నిర్మాణం, కృత్రిమ డ్రోన్ నిర్మాణం, త్రీడీ హోల్‌గ్రామ్స్, స్మార్ట్ వీల్ చైర్, వ్యవసాయ వ్యర్థాల నుంచి బయో ఇంధనం తయారీ, రోబోటిక్ ఇంజనీరింగ్ టెక్నీక్స్, ఆమ్లా క్షారాల గుర్తింపు, ఆహార పదార్థాల కల్తీ నివారణ, రక్త గ్రూపుల ని ర్ధారణ, షుగర్ పరీక్ష విధానం, శరీర అవయవాల పనితీరు వంటి పలు నమూనాలను రూపొందించి ప్రదర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ డా॥ గొల్లపూడి వీరేంద్రచౌదరి మాట్లాడుతూ సర్ సివి రామన్ భౌతిక శాస్త్రానికి చేసిన సేవలకు గాను నోబెల్ బహుమతి పొంది భారతీయ శాస్త్రవేత్తల యొక్క గొప్పతనాన్ని చాటి చెప్పారన్నారు. తమ పాఠశాల విద్యార్థులు చదువుతో పాటు తమకున్న ఆసక్తులను గుర్తించి వారిని ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భం గా సైన్స్ ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో త్రివేణి కృష్ణవేణి విద్యా సంస్థల డైరెక్టర్ యార్లగడ్డ వెంకటేశ్వరరావు, పాఠశాల సిఆర్‌వో కాట్రగడ్డ మురళీకృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ స్వప్న, ముస్తఫా, క్యాంపస్ ఇంచార్జిలు చార్లెస్, సందీప్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వెంకటసాయికి పరామర్శ

ప్రజాపక్షం/వైరా: వైరా మున్సిపాలిటీ 6వ వార్డుకు చెందిన పోలూరి సైదులు కుమారుడు వెంకటసాయి ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన విషయం తెలుసుకున్న వైరా మున్సిపాలిటీ 12వ వార్డు కౌన్సిలర్ మాదినేని సునీత ప్రసాద్ సోమవారం సైదులు నివాసానికి వెళ్లి ఆయన కుమారుడు వెంకటసాయిని పరామర్శించి ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ప్రమాదం జరిగిన తీరును పోలూరు సైదులు ద్వారా అడిగి తెలుసుకున్నారు.

పది పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి : కలెక్టర్

ప్రజాపక్షం/కొత్తగూడెం : మార్చి 14 నుండి జరిగే పతో తరగతి పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ మేరకు ఐడిఓసిలో సోమవారం శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 73 సెంటర్లలో 12731 మంది రెగ్యులర్, 404 మంది ప్రైవేటు అభ్యర్థులు పరీక్షలు రాస్తున్నారని చెప్పారు. ప్రతీ రోజు ఉ.9.30 గం. నుండి మధ్యాహ్నం 12.30 గం. వరకు పరీక్ష ఉంటుందన్నారు. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు పరీక్షల కోసం అన్ని రకాల ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. విద్యార్థుల ప్రయాణానికి అనువైన వాతావరణం కల్పించాలని సూచించారు. పరీక్షా కేంద్రాల వద్ద సెక్షన్ 163బి ని అమలు చేయాలని పోలీసులకు సూచించారు. పరీక్షా కేంద్రాల వద్ద అన్ని రకాల సదుపాయాలు కల్పించాలని, విద్యార్థులు ఒత్తిడి గురికాకుండా పరీక్షలు రాసే వాతావరణాన్ని కల్పించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో విద్యాధికారి నాగలక్ష్మి తో పాటు శంఖు ప్రసాద్, మాధవరావుతో పాటు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి రాజకీయాలకతీతంగా సహకరించాలి

ప్రజాపక్షం/నేలకొండపల్లి : గ్రామాభివృద్ధి కి రాజకీయాలకు అతీతంగా సహకరించాలని బైరవునిపల్లి సర్పంచ్ గుండపనేని లక్ష్మణావు కోరారు. సోమవారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పంచాయతీని ఆదర్శ పంచాయతీ గా తీర్చిదిద్దేందుకు కార్యచరణ ను రూపొందిస్తున్నట్లు తెలిపారు. పరిసరాల ను ప్రతీ ఒక్కరూ పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. గ్రామాభివృద్ధిలో తోడ్పాటును ను అందించేందుకు ప్రతీ ఒక్కరూ పన్నులు చెల్లించాలని కోరారు. ఆదర్శ పంచాయతీ గా తీర్చిదిద్దేందుకు అందరూ సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో ఉప సర్పంచ్ ఆలేటి మహేష్, వార్డు సభ్యులు బాలిన నందిని, ముత్యాల వేంకట్రామ్మ, పెద్దపాక మంగమ్మ, పెద్దపాక వెంకన్న, గోపి ఉపేందర్, గ్రామ పెద్దలు బాలిన కృష్ణంరాజు, ముత్యాల వెంకటేశ్వరరావు, నూక వేంకటేశ్వరరావు, కడారు వెంకటేశ్వరరావు, పోలంపల్లి పిచ్చయ్య, మరి కంటి రమేష్, గండు సైదులు, యం.రత్నం, అంగన్వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శి వేధింపులు

- ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డ మహిళా సర్పంచ్
- పింఛన్‌లు ఇప్పిస్తామంటూ కార్యదర్శి చేతివాటం ?

ప్రజాపక్షం/పాల్వంచ : తమ అక్రమాలకు, ఆగడాలకు అడ్డుతగులుతున్నదని ఓ మహిళా సర్పంచ్‌పై గ్రామ పంచాయితీ కార్యదర్శి వేధింపులను తట్టుకోలేక సర్పంచ్ ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన సోమవారం పాల్వంచ మండల వ్యాప్తంగా కలకలం సృష్టిస్తున్నది. సర్పంచ్ తెలిపిన ప్రకారం మండల పరిధి సత్యనారాయణపురం (మొండికట్ట) గ్రామ పంచాయితీ సర్పంచ్ జర్పుల సరితను గత మూడు నాలుగు వారాలుగా కార్యదర్శి వేధింపులకు గురి చేస్తున్నారని చెప్పారు. రెండు సంవత్సరాలుగా పంచాయితీలో పాలక వర్గం లేకపోవటంతో సెక్రటరీ ఇష్టారీతిగా పాలనను కొనసాగించారు. పంచాయితీ లెక్కలు అడిగేవారు ఎవరూ లేరు. దీనితో పలువురి వద్ద నుండి వృద్ధాప్య, వితంతు పింఛన్‌లు ఇప్పస్తామంటూ చేతివాటానికి సైతం దిగినట్లు ఆరోపించారు. రెండు సంవత్సరాలైనా పింఛన్‌లు రాకపోవటంతో బాదితులు సర్పంచ్‌కు మొరపెట్టుకొన్నారు. తన బండారం బైటపడటంతో నా పట్ల ఉద్దేశ్యపూర్వకంగా వేధింపులకు దిగిన కార్యదర్శి ఉపాధి హామీ పనుల్లో సైతం లబ్దిదారులను ఎంపిక చేయాలని సర్పంచ్‌పై ఒత్తిడి తెచ్చి ప్రజల మధ్య వివాదాలకు ఆజ్యంపోస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళా సర్పంచ్ అని చూడకుండా ఎప్పుడూ ఎదో ఒక సాకుతో ఇబ్బందులకు గురిచేస్తున్నడన్నారు.మీకు బదులుగా మీ భర్త ఎందుకు మాట్లాడుతున్నారని, ఇలా అయితే వార్డు మెంబర్లతో సంతకం చేయించి నన్ను పదవి నుండి తొలగిస్తానంటూ పలు పకాలుగా వేధనకు పాల్పడతున్నారని వాపోయింది. అనంతరం సర్పంచ్ భర్త మాట్లాడుతో మా అమాయకత్వాన్నిఆసరా చేసుకొన్న గ్రామ సెక్రటరీ ఉద్దేశ్యపూర్వకంగా సర్పంచ్‌ను తన మాటలతో పలు విధాలుగా వేధింపులకు పాల్పడుతున్నాడని దీనితోనే సర్పంచ్ ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు తెలిపారు. గ్రామస్థుల నుండి పింఛన్ ఇపిస్తామంటూ తీసుకొన్న ఘటనలో వాయిస్ రికార్డులు ఉన్నాయని చెప్పారు. ఉన్నతాధికారులు స్పంధించి పంచాయితీ సెక్రటరీపై తగు విచారణ చేసి కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

హెల్మెట్ ధరించండి.. ప్రాణాలు కాపాడుకోండి

డిఎస్పి రవీందర్ రెడ్డి

ప్రజాపక్షం/మణుగూరు: ప్రతి ఒక్కరూ ద్విచక్ర వాహనదారుడు ఎలిమెంట్ ధరించి విలువైన ప్రాణాలు కాపాడుకోవాలని డీఎస్పీ రవీందర్ రెడ్డి కోరారు. ఇంటి నుండి బయలుదేరిన వెంటనే హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని, డ్యూటీ కి వెళ్లే సమయంలో, డ్యూటీ నుండి తిరిగి వస్తున్న సమయంలో కార్మికులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని డిఎస్పి రవీందర్ రెడ్డి సూచించారు.

లాయర్ కుటుంబానికి అండగా నిలిచిన స్నేహితులు

ప్రజాపక్షం/మణుగూరు: చిన్ననాటి స్నేహం, పాఠశాల బెంచీలపై పంచుకున్న నవ్వులు, కలిసికట్టుగా నడిచిన కలలు, ఒక్క క్షణంలో జ్ఞాపకాలుగా మారిపోయాయి. లాయర్ సూర్యం అకాల మరణం స్నేహితుల గుండెల్లో చెరగని బాధను మిగిల్చింది. ఇలాంటి విషాద సమయంలో కుటుంబం ఒంటరిగా మిగలకూడదనే భావంతో చిన్ననాటి స్నేహితులు, క్లాస్‌మేట్స్ అందరూ ఒక్కటయ్యారు. తమ బాధను అణచుకుని, సూర్యం కుటుంబానికి ఆర్థిక సహాయం అందించారు. ఇది కేవలం సహాయం మాత్రమే కాదు స్నేహానికి నిలువెత్తు నిదర్శనంగా నిలిచింది. ఈ సందర్భంగా పులిపాటి పాపారావు, కంద్రపు వెంకటరెడ్డి, భూక్యా హథీరామ్, తలారి శ్రీబాబు, రాము పుట్ట, పిట్టల రవి, గంగపూరి రామారావు, షేక్ అహ్మద్, నర్రా రంజిత్ కుమార్, వంచర్ల రాఘవేంద్ర, నక్కా రామచందర్, జర్పుల భాస్కర్, చాపల శ్రీను, తోడేటి వీరభద్రం, రాయల శ్రీను (యూఎస్ఏ), మోడేపల్లి శివకృష్ణ, పాషా, ప్రకాష్, మందడి నాగరాజు తదితరులు పాల్గొన్నారు. దశదినకర్మ రోజున నిర్వహించిన ఈ కార్యక్రమంలో స్నేహితులు సూర్యం జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ భావోద్వేగానికి గురయ్యారు."సూర్యం మా జీవితంలో ఒక భాగం అతని లేని లోటు ఎప్పటికీ తీరదు. కానీ అతని కుటుంబం ఎప్పుడూ ఒంటరిగా ఉండదు మేమంతా ఉన్నాం" అని కన్నీటి కళ్లతో తెలిపారు. స్నేహం అంటే మాటల్లో కాదు ఇలాంటి కష్టకాలంలో అండగా నిలబడటంలోనే అసలు అర్థం ఉందని ఈ సంఘటన మరోసారి నిరూపించింది. సూర్యం ఈ లోకంలో లేకపోయినా అతని జ్ఞాపకాలు స్నేహితుల గుండెల్లో ఎప్పటికీ నిలిచిపోతాయి.

నేడు శ్రీరామ నవమి సమీక్షా సమావేశం

ప్రజాపక్షం/భద్రాచలం : మార్చి 27 నుండి 28 తేదీల్లో జరిగే శ్రీ సీతారామ చంద్రస్వామి కళ్యాణమహోత్సవం, పట్టాభిషేకం వేడుకలకు సంబంధించి నేడు సబ్ కలెక్టర్ కార్యాలయంలో మధ్యాహ్నం 3 గం.లకు జిల్లా అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించనున్నట్లు కలక్టర్ జితేష్ వి పాటిల్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

గిరిజన దర్బారు అర్జీల పరిష్కారానికి కృషి చేయాలి

ప్రజాపక్షం/భద్రాచలం : గిరిజన దర్బారులో వచ్చిన దరఖాస్తుల పరిష్కారానికి అధికారులు కృషి చేయాలని ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి రాహుల్ అన్నారు. సోమవారం ఐటిడిఏ సమావేశ మందిరంలో నిర్వహించిన గిరిజన దర్బారుకు హాజరైన ఆయన వివిధ ప్రాంతాల నుండి వచ్చిన గిరిజనుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. అనంతరం వాటిని పరిశీలించి వివిధ శాఖల అధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన గిరిజనుల కుప్రభుత్వ పథకాలు అందించేందుకు నిరంతర కృషి సాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన విభాగాల అధికారులు పాల్గొన్నారు.

కళ్యాణ లక్ష్మీ చెక్కుల పంపిణీ

ప్రజాపక్షం/అశ్వాపురం: మండల కేంద్రంలో గల రైతు వేదికలో నిర్వహించిన అశ్వాపురం మండలానికి చెందిన 29మంది లబ్దిదారులకి సుమారు 23లక్షల రూపాయల విలువల గల కళ్యాణ లక్ష్మీ , షాదీముబాకర్ చెక్కులను ఎంఎల్ఏ పాయం వెంకటేశ్వర్లు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ పేదల ప్రభుత్వమని, రాష్ట్రంలోని పేద వర్గాలకు కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. రాష్ట్రంలో అతి త్వరలో రాజీవ్ యువవికాసం ద్వారా లబ్దిదారులకు రుణాలు మంజూరు చేయడం జరుగుతుందని, ప్రతి పేదవాడు సొంతింటి కల నిజం చేసుకునేందుకు ఇందిరమ్మ ఇళ్లను కాంగ్రెస్ ప్రభుత్వం అందజేస్తుందన్నారు. ఈకార్యక్రమంలో అశ్వాపురం తహసీల్దార్ సౌరాబ్ శర్మ, తహసీల్ధార్ మణిధర్, ఎంపీడీవో ముత్యాలరావు, అశ్వాపురం మండల కాంగ్రెస్ అధ్యక్షులు ఓరుగంటి బిక్షమ్మయ్య, నాయకులు గాదె కేశవరెడ్డి, ఓరుగంటి రమేష్, యువజన నాయకులు గొల్లపల్లి నరేష్, కోలా ప్రశాంత్, లబ్దిదారులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సిపిఎస్ ఉద్యోగుల డిఏ బకాయిలు చెల్లించాలి

ప్రజాపక్షం/కూసుమంచి: ఈనెల 20 నుండి 24 వరకు రాష్ట్ర వ్యాప్తంగా మండల స్థాయిలో డిఏ బకాయిలు చెల్లించాలంటూ టీఎస్‌సిపిఎస్ ఈ యు ఆధ్వర్యంలో నిరసనలు తెలిపారు. అందులో భాగంగా ఖమ్మం జిల్లాలో పలు చోట్ల నిరసన కార్యక్రమాలు చేపట్టారు. సిపిఎస్ ఉద్యోగ, ఉపాధ్యాయులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న డిఏ బకాయిలు వెంటనే చెల్లించాలంటూ మండలంలోని జీళ్ళ చెరువు కాంప్లెక్స్ మీటింగ్‌లో మధ్యాహ్న భోజన విరామ సమయంలో ప్లే కార్డ్స్‌తో జరిపిన నిరసన కార్యక్రమంలో టీఎస్ సిపిఎస్ ఈయు ఖమ్మం జిల్లా అధ్యక్షులు చంద్రకంటి శశిధర్ పాల్గొన్నారు. ఖమ్మం జిల్లా వ్యాప్తంగా జరిగిన నిరసన కార్యక్రమాల్లో టీఎస్ సిపిఎస్ ఈయు ఖమ్మం జిల్లా అసోసియేట్ ప్రెసిడెంట్ భాను, జిల్లా మహిళా ఉపాధ్యక్షురాలు శ్వేత, నరసింహారావు, శ్రీకాంత్, మోహన్, రవి కృష్ణ, తదితర ఉద్యోగ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అమెరికన్ సామ్రాజ్యవాదాన్ని తిప్పికొట్టాలి

ప్రజాపక్షం/నేలకొండపల్లి : ప్రపంచవ్యాప్తంగా స్వేచ్ఛాయుత సమాజ మనుగడకు తీవ్ర అవరోధంగా మారిన అమెరికన్ సామ్రాజ్యవాదాన్ని తిప్పి కొట్టాలని సిపిఐ (ఎం) మండల కార్యదర్శి కె.వి.రామిరెడ్డి ప్రజలకు పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక సిపిఐ (ఎం) కార్యాలయం రావెళ్ల సత్యనారాయణ భవనంలో పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో ప్రపంచవ్యాప్త సామ్రాజ్యవాద శక్తుల ఆగడాలు ఆధిపత్యం దురాఘాతలపై చర్చ గోష్ఠి జరిగింది. ఈ సందర్భంగా పార్టీ మండల కమిటీ సభ్యుడు పగిడికత్తుల నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పెట్టుబడిదారీ వ్యవస్థ సామ్రాజ్యవాద శక్తుల వికృత రూపం ఎలా ఉంటుందో అమెరికాలో అధ్యక్షుడు ట్రంపు నాయకత్వంలో జరుగుతున్న దాడులు, ఆక్రమణలు, ఋజువు చేస్తున్నాయని విమర్శించారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు భూక్య కృష్ణ, డి వై ఎఫ్ ఐ జిల్లా కార్యదర్శి బొడ్డు మధు, కట్టేకోల వెంకన్న, డేగల వెంకటేశ్వరరావు, దండా సూర్యనారాయణ, సిరికొండ నాగేశ్వరరావు, పోతనబోయిన పెరుమాళ్ళు, దండా సైదారావు, గడిపూడి వెంకటేశ్వర్లు,(స్వామి) సామల మల్లికార్జున్, డేగల హరి ప్రసాద్ గాదె వెంకటేశ్వరరావు, గరికపాటి మధు తదితరులు పాల్గొన్నారు.

సీతారామ కాలువ నిర్మాణానికి రైతుల అభ్యంతరం

ప్రజాపక్షం/పెనుబల్లి: సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు కాలువను నిర్మాణానికి బయన్నగూడెం రైతులు అభ్యంతరం వ్యక్తం చేశారు. పెనుబల్లి మండలం బయన్నగూడెం గ్రామంలో సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు నీ కాలువ భూ సేకరణకు సోమవారం మండల తహశీల్దార్ వీరభద్ర నాయక్ గ్రామసభ నిర్వహించారు. కాలువ నిర్మాణాల్లో 38 మంది రైతులకు సంబంధించిన 12 ఎకరాల భూమిని ఇచ్చేందుకు నిరాకరించారు. సన్న చిన్న కారు రైతుల భూములు అర ఎకరం, ఎకరం కోల్పోతున్నామని భూమిని నమ్ముకున్న మాకు భూమి లేకపోతె జీవనాదారం లేదని తెలిపారు. ఈ కాలువ ద్వారా భూములు కోల్పోవడం తప్ప ఎటువంటి ప్రయోజనం లేదని రైతులు గ్రామసభలో వివరించారు.

ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

-కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ : ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి జిల్లా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అదనపు కలెక్టర్‌లు డా॥ పి.శ్రీజ, పి. శ్రీనివాసరెడ్డి లతో కలిసి అర్జీలను స్వీకరించారు. వేంసూరు మండలం మర్లపాడు గ్రామానికి చెందిన బీమిరెడ్డి పుల్లారెడ్డి భరణిపాడు నుంచి పర్వతాపురం ఆర్‌అండ్‌బి రోడ్డు గుంతలతో అధ్వాన్నంగా ఉందని, భరణిపాడు కాలువ మీద ఉన్న వంతెన శిథిలావస్థలో ఉందని, వీటికి అవసరమైన మరమ్మతు పనులు వెంటనే చేపట్టాలని కోరుతూ దరఖాస్తు చేశారు. ఖమ్మం నగరం ఖానాపురం హవేలీకి చెందిన ఎన్. నటరాజ్ తాను దివ్యాంగుడినని తనకు సొంత ఇల్లు లేనందున ఇందిరమ్మ ఇంటిని మంజూరు చేయాలని దరఖాస్తు చేశారు. నేలకొండపల్లి మండలం అప్పలనర్సాపురం గ్రామస్తులు తమ గ్రామంలో సెల్ ఫోన్ సిగ్నల్ లేకపోవడం వల్ల ఇబ్బందులు పడుతున్నామని జియో టవర్ నిర్మించటానికి అనుమతించాలని దరఖాస్తు చేశారు. వైరా మున్సిపాలిటీ 14వ వార్డుకు చెందిన ఎస్సి కాలనీ వాసులు నిరూపయోగంగా ఉన్న ఎన్నెస్పి కెనాల్ స్థలంలో ఎస్సి కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి అనుమతి ఇవ్వాలని కోరుతూ దరఖాస్తు చేశారు.ఆయా దరఖాస్తులను పరిశీలించిన కలెక్టర్ సత్వరమే తగు చర్యలు తీసుకోవాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు.

పాలన అంశాల పట్ల అధికారులు దృష్టి పెట్టాలి ...

పాలన అంశాల పట్ల అధికారులు దృష్టిపెట్టాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో పరిపాలన అంశాలపై జిల్లా అధికారులతో అదనపు కలెక్టర్లు డా॥ పి.శ్రీజ, పి. శ్రీనివాసరెడ్డి లతో కలిసి కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సత్తుపల్లిలో అటవీ వస్తువుల విక్రయం కోసం ప్రత్యేకంగా మార్ట్ నిర్మాణానికి గ్రామీణాభివృద్ధి శాఖ తరుపున రూ. 10 లక్షలు మంజూరు చేసేందుకు ప్రతిపాదనలు సమర్పించాలన్నారు. ధంసలాపురం, నేలకొండపల్లి, వెంకటగిరి వద్ద ఉన్న డబుల్ బెడ్‌రూం ఇండ్లపై రిపోర్టులు అందించాలన్నారు. రెవెన్యూ సదస్సులో వచ్చిన భూ భారతి, సాదాబైనామా దరఖాస్తుల పరిశీలన పురోగతిపై రెగ్యులర్ రిపోర్టు అందించాలన్నారు. భూసేకరణకు సంబంధించి పెండింగ్ కోర్టు కేసులకు సకాలంలో కౌంటర్ ఫైల్ చేయాలన్నారు. వైరా, ఏదులాపురం మున్సిపాలిటీలలో డంపింగ్ యార్డు ఏర్పాటుకు స్థలం ఫైనల్ చేయాలన్నారు. యుఎల్‌బి పరిధిలో పెండింగ్ పనులపై రెగ్యులర్‌గా సమావేశాలు నిర్వహించాలని, పిఎంశ్రీ పాఠశాలలకు సంబంధించి పనుల బిల్లులు త్వరగా చేసి క్లెయిమ్ చేయాలన్నారు. ఫిబ్రవరి 27న జరిగే దిశ సమావేశానికి ప్రతి ఒక్క అధికారి సమాచారంతో అందుబాటులో ఉండాలని, స్త్రీ నిధి రుణాల రికవరీపై దృష్టి సారించాలన్నారు. ఈ సమావేశంలో జెడ్పిసిఈవో దీక్షారైనా, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

-ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో కలెక్టర్‌కు వినతి

ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని ఏఐఎస్ఎఫ్ ఖమ్మంజిల్లా సమితి అధ్యక్షులు మదుపల్లి లక్ష్మణ్ ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం ఏఐఎస్ఎఫ్ ఖమ్మంజిల్లా సమితి ఆధ్వర్యంలో కలెక్టర్ అనుదీప్‌దురిశెట్టికి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మదుపల్లి లక్ష్మణ్ మాట్లాడుతూ పరీక్షా కేంద్రాల వద్ద బందోబస్తు ఏర్పాటు చేసి సమర్థవంతంగా పరీక్షలు నిర్వహించేందుకు తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఈనెల 25 నుంచి జరగనున్న ఇంటర్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. పరీక్షా కేంద్రాలలో మాస్ కాపీయింగ్ జరగకుండా, సిసి కెమెరాలను ఏర్పాటు చేయాలన్నారు. సమస్యాత్మక పరీక్షా కేంద్రాల వద్ద ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలన్నారు. పరీక్షా కేంద్రాలకు హాజరయ్యే విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఆర్టిసి బస్సులు ఏర్పాటు చేయాలని, పరీక్షా కేంద్రాల వద్ద ఎఎన్ఎంలను అందుబాటులో ఉంచాలని, మంచినీటి సౌకర్యం, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. ఇంటర్ విద్యార్థులు పరీక్షా కేంద్రానికి చేరుకోవడానికి ఏమైనా ఇబ్బందులు ఉంటే ఏఐఎస్ఎఫ్ ఖమ్మంజిల్లా సమితి తరుపున వాహనాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. రవాణా సౌకర్యం కావాల్సిన విద్యార్థులు 8106146993, 9666680674 నెంబర్లను సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సమితి సభ్యులు మనోజ్, ఆకాష్, నాయకులు గోపి, ప్రతాప్, రవీందర్, రాకేష్, ఉమామహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఏఐలో వైరా వాసి ప్రతిభ

-పలువురి ప్రశంసలు

ప్రజాపక్షం/ వైరా : వైరా ప్రాంతానికి చెందిన ముగ్గ మురళీకృష్ణ ఏఐ, రోబోటిక్స్ విద్యలో అత్యంత ప్రతిభ చూపి పలువురి ప్రశంసలు పొందుతున్నాడు. కేంద్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వికసిత్ భారత్ 2047 లక్ష్యంలో భాగంగా ఏఐ, రోబోటిక్స్ విద్యను దేశం నలుమూలల చేరవేసే సంకల్పంలో ఉంది. ఢిల్లీలో జరిగిన భారత్ బోధన్ ఏఐ ఎన్‌క్లేవ్‌లో వైరా పట్టణంలోని బ్రాహ్మణపల్లికి చెందిన డా॥ ముగ్గ మురళీకృష్ణ పాల్గొని అత్యంత ప్రతిభ చూపారు. మురళీకృష్ణ రూపొందించిన ఎంవిఆర్ కరిక్యూలంను పరిశీలించిన వారు ఆయనను అభినందించారు. గ్రామీణ విద్యార్థులకు సులభ రీతిలో అర్థమయ్యేవిధంగా ఎంవిఆర్ కరిక్యూలంను రూపొందించి విడుదల చేశారు. ముగ్గ మురళీకృష్ణ తండ్రి ముగ్గ వెంకటేశ్వరరావు ప్రధానోపాధ్యాయునిగా పనిచేసి ఉద్యోగ విరమణ చేశారు.

ఏఐ సాంకేతికతతో మెరుగైన పనితీరు

-కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

-ఏఐ సాంకేతికత క్లౌడ్ వినియోగంపై అధికారులకు అవగాహన

ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : ఏఐ సాంకేతికత, క్లౌడ్ వినియోగం ద్వారా పాలనలో మెరుగైన ఫలితాలు సాధించే అవకాశం ఉంటుందని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. కలెక్టరేట్‌లో పరిపాలనలో ఏఐ సాంకేతికత క్లౌడ్‌ను పవర్ పాయింట్ ప్రజంటేషన్, ఎక్స్‌ఎల్‌లో ఏవిధంగా ఉపయోగించవచ్చు అనే అంశంపై జిల్లా అధికారులకు కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా అవగాహన కల్పించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఏఐ సాంకేతికత, క్లౌడ్ వినియోగం వల్ల మన పని మరింత మెరుగ్గా వేగంగా పూర్తి చేసే అవకాశం ఏర్పడిందని దీనిని ప్రతి ఒక్క అధికారి వినియోగించుకోవాలన్నారు. క్లౌడ్‌తో నివేదికలు వేగంగా తయారు చేసుకునే అవకాశం ఉందన్నారు. క్లౌడ్ అనే ఏఐ ద్వారా ఎక్స్ ఎల్ పవర్ పాయింట్ ప్రజంటేషన్ మెరుగ్గా తయారు చేసుకోవచ్చునన్నారు. ఎటువంటి ప్రజంటేషన్ కావాలో చెబితే క్లౌడ్ వేగంగా తయారు చేస్తుందని ఎక్స్‌ఎల్‌లో అవసరమైన ఫార్ములా వినియోగిస్తూ మంచి విశ్లేషణ మన ముందు ఉంచుతుందన్నారు. ధాన్యం కొనుగోలుకు సంబంధించి గత ఐదేండ్ల వివరాలు అప్‌లోడ్ చేస్తే అధికంగా పెండింగ్ ఉన్న రైస్‌మిల్లర్ల జాబితా క్షణాల్లో అందిస్తూ మనం ఎక్కడ ఫోకస్ పెట్టాలో చెబుతుందన్నారు. రెండు మూడు గంటల సమయం తీసుకునే పనులు క్లౌడ్ వినియోగం ద్వారా నిమిషాల వ్యవధిలో పూర్తవుతుందన్నారు. ప్రతి శాఖకు సంబంధించి ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ కార్యక్రమాల పురోగతి, సిబ్బంది పనితీరు పర్యవేక్షణలో కూడా క్లౌడ్‌ను వినియోగించాలన్నారు. ఏఐ టూల్స్ వాడుతూ మన కార్యాలయ విధులను సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. ప్రభుత్వం అమలు చేసే పథకాలను ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం లబ్దిదారులకు త్వరితగతిన చేర్చడంలో శాఖ పరంగా పథకాల అమలు సమర్థవంతంగా జరిగేలా ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు ఏఐ సాంకేతికత క్లౌడ్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు డా॥ పి.శ్రీజ, పి. శ్రీనివాసరెడ్డి, జెడ్పిసిఈవో దీక్షారైనా, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

20వ వార్డు అభివృద్ధికి చేయూతనందిస్తా..

ప్రజాపక్షం/వైరా: వైరా మున్సిపాలిటీ 20వ వార్డు కౌన్సిలర్ వుంద్రు వరలక్ష్మి, శ్యామ్‌బాబు దంపతుల ఆధ్వర్యంలో విద్యార్థులకు బ్యాగులు, వికలాంగుడికి వీల్‌చైర్‌ను వైరా మున్సిపాల్ చైర్మన్ కాపా చంద్రకళ డాక్టర్ కాపా మురళీకృష్ణ దంపతులు, వైరా మున్సిపాలిటీ పరిధిలోని 20వ వార్డులో మండల ప్రజాపరుఇషత్ పాఠశాలల శాంతినగర్ ఎస్టీ కాలనీలో చదువుతున్న విద్యార్థులకు బ్యాగ్‌లు, కేలోత్ చంద్రు అనే వికలాంగుడికి వీల్‌చైర్ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కాపా మురళీకృష్ణ మాట్లాడుతూ ఈ ఐదు సంవత్సరాల కాల పరిధిలో 20వ వార్డు అభివృద్ధి కొరకు సహకరిస్తామని అన్నారు. అనంతరం మున్సిపాల్ చైర్‌పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ మాట్లాడుతూ వార్డులో సేవా కార్యక్రమాలతో పాటు వార్డు అభివృద్ధి పనుల్లో అగ్రగామిగా ఉంచేందుకు చేయూతను అందిస్తానని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ రామకృష్ణ, రెడ్డి, వాంకుడోత్ బీక్యా, గుగులోతు లక్ష్మి బాయి, షేక్ రహీం(పండు), తేజావత్ నాగేశ్వరరావు, గడసందుల దర్గయ్య, కొర్రా వెంకటేశ్వర్లు, బానోతు కృష్ణ బాబు, తేజావత్, బాలమ్మ, వాంకుడోతు మని, భూక్యా లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభానికి సిద్ధంగా నూతన ఆసుపత్రి భవనం

స్పెషలిస్టు వైద్యుల కోసం ఎదురుచూపు

ప్రజాపక్షం/పెనుబల్లి: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి ఎంతో మంది మహానుభావుల కృషితో నిర్మాణం జరిగింది. 50 ఏళ్ల క్రితం 30 పడకలుగా ప్రారంభమై అంచలంచెలుగా అభివృద్ధి చెంది 50 పడకల ఆసుపత్రిగా విస్తరించింది. ప్రారంభంలో నిర్మించిన భవనాలు ఆ తరువాత కట్టిన గదులు నేడు శిథిలావస్థకు చేరాయి. టీఆర్ఎస్ పాలనలో నాటి వైద్య ఆరోగ్య శాఖ మంత్రి ఈ ప్రాంతం పర్యటించిన సందర్భంలో ఆసుపత్రి దయనీయ స్థితిని చూసి కొత్త భవనాల నిర్మాణం కోసం రూ. 7.50 కోట్లు మంజూరు చేసి, 2023 లో శంకుస్థాపన చేశారు. ఆ నిధులతో కొత్త భవనాల్లో 30 పడకలకు సరిపోను గదులు నిర్మించారు. అదునాతనమైన సౌకర్యాలతో నిర్మించిన ఈ భవనం ప్రారంభం కోసం ఎదురు చూస్తుంది. దంత, ఆర్థోపెడిక్ డాక్టర్లు ఉన్నప్పటికీ శస్త్ర చికిత్స పరికరాలు లేక ఆ విభాగంలో సేవలు ఇప్పటివరకు అందుబాటులోకి రాలేదు. కొత్త భవనం ప్రారంభమయ్యాకైనా వసతులు సమకూరుతాయేమోనని ఈ ప్రాంత ప్రజలు ఎదురుచూస్తున్నారు. స్థానిక ఎం.ఎల్.ఏ. కృషితో సింగరేణి సంస్థ నుంచి వచ్చే కార్పొరేట్ సామాజిక బాధ్యత (కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ సీఎస్ ఆర్) నిధులతో దంత వైద్యానికి సంబంధించి పరికరాలు సమకూర్చారు. ఆర్థోపెడిక్ విభాగంలో మామూలుగా కట్లు కట్టటం మినహా ఎముకలు విరిగితే ఆపరేషన్ చేయలేకపోతున్నారు. మొత్తం 20 మంది వైద్యులు ఉండాలి. వీరిలో 13 మందిని నియమించారు. ఐదుగురు వైద్యులు డిప్యుటేషన్ పై ఇతర ప్రాంతలకు వెళ్లారు. చిన్నపిల్లల వైద్యులు లేరు. గతంలో కంటి వైద్యులు ఉన్నారు. ప్రస్తుతం లేరు. ఇటీవలే ఏర్పాటు చేసిన కంప్లీట్ బ్లడ్ పిక్చర్ (సీబీపీ) మిషన్ ద్వారా ప్లేట్ లెట్ కౌంట్ తో పాటు ఇతర అన్ని రకాల రక్త పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఎప్పుడూ 20 నుచి 30 మంది రోగులు ఇన్ పేషెంట్లుగా బెడ్ పై ఉంటారు. 100 మందికి పైగా ఔట్ పేషంట్లు వస్తుంటారు. ఇక్కడ చిన్నపిల్లల డాక్టర్ అవసరం ఎంతో ఉంది.ప్రసవం అనంతరం శిశువులను 20 కిలోమీటర్ల దూరంలో సత్తుపల్లిలోని ఆస్పత్రులకు రెండు మూడు విడతలు తీసుకెళ్లాల్సి వస్తుంది.

వైరా ఎస్సై రామారావుకు పరామర్శ

ప్రజాపక్షం/వైరా: ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన వైరా ఎస్సై పుప్పాల రామారావుని సోమవారం వైరా మున్సిపాలిటీ రెండో వార్డు కౌన్సిలర్ తిరుపతి శివకుమారి భర్త తిరుపతి శ్రీనివాసరావు బిఆర్ఎస్ నాయకులతో కలిసి ఖమ్మంలో ఎస్సై రామారావు అయిన నివాసం నందు పరామర్శించారు. పరామర్శించిన వారిలో తిరుపతి శ్రీనివాసరావు, బండారు శ్రీనివాసరావు, బత్తుల వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

ఉపాధి కూలీలకు గాయాలు

ప్రజాపక్షం/ రఘునాథపాలెం : ట్రాలీ ఆటో చెట్టును ఢీకొన్న ఘటనలో బూడిదంపాడు గ్రామానికి చెందిన ఉపాధి కూలీలకు గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే... సోమవారం గ్రామానికి చెందిన ఏడుగురు ఉపాధి హామీ కూలీలు డైవర్షన్ డ్రైన్ (వరద కాలువ నీటి మళ్లింపు) పనుల కోసం వెళ్లేందుకు అటుగా వెళ్తున్న ఓ ట్రాలీ ఆటో ఎక్కారు. బూడిదంపాడు, సూర్యాతండా రహదారిలో ఓ మూల మలుపు వద్ద ట్రాలీ ఆటో అదుపు తప్పి చెట్టును ఢీకొంది. ప్రమాదంలో ఆరుగురు కూలీలకు గాయాలయ్యాయి. వారిని చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. ఆసుపత్రిలో చికిత్స పొందిన కూలీలను అదనపు పిడి కె. శ్రీదేవి, ఏపివో పద్మయ్య నాయుడు, ఈసి దీపక్ పరామర్శించారు. ప్రమాద వివరాలను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన చికిత్స అందించాలని వైద్యులకు తెలిపారు.